ప్రభాత
# కడప-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
సోమవారం 06 జూలై 2026

## ఎస్ఐఆర్ ప్రక్రియ వేగవంతం చేయాలి : ఆర్డీవో

**పీలేరు, జూలై 5 ప్రభాతవార్త:**
ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలని ఆర్డీవో నారాయణరెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని బోదేషావలి దర్గా, కడప రోడ్డు, కోటపల్లె జెడ్పీ హైస్కూల్ నందు ఎస్ఐఆర్ హెల్ప్ డెస్క్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 14లోపు ఎస్ఐఆర్ కార్యక్రమం పూర్తి చేయాలన్నారు. బీఎల్ వోలు చురుగ్గా పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఐ మురగయ్య, బీఎల్ వోలు పాల్గొన్నారు.


హెల్ప్ డెస్క్ కేంద్రాలను తనిఖీ చేస్తున్న ఆర్డీవో నారాయణ

## మొక్కులు చెల్లింతిమి సల్లంగ చూడు గంగమ్మా...!

**బోయకొండ(చౌడేపల్లి), జూలై 5 ప్రభాతవార్త**
మొక్కులు చెల్లించాము సల్లంగా చూడు గంగమ్మా అంటూ భక్తులు అమ్మవారి చెంతి మొకరిల్లారు. ఆదివారం కొండ దినం కావడంతో ఆలయంలో పలు కార్యక్రమాలు జరిగాయి. ఉదయాన్నే అర్చకులు, వేద పండితుల ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష పూజలు, అలంకరణ గావించారు. రాష్ట్రంతోపాటు కర్ణాటక, తమిళనాడు, తెలంగాణాల నుంచి విశేష సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఇఓ, ఉపకమీషనర్ ఏకాంబరం, ఆలయ అధికార, అర్చక, సిబ్బంది భక్తులకు సేవలందించారు.



### రాయలసీమకు భారీ వరం.
## జేఎస్‌డబ్ల్యూ స్టీల్ ప్లాంట్: మంత్రి రాంప్రసాద్ రెడ్డి

**రాయచోటి జులై 5 ప్రభాతవార్త**
ఆంధ్రప్రదేశ్‌ను పారిశ్రామికంగా అగ్రగామిగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి క్యాంపు కార్యాలయం నుండి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. రాయలసీమలో రూ.16,350 కోట్ల పెట్టుబడితో జేఎస్ డబ్ల్యూ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టడం ఈ ప్రాంత అభివృద్ధిలో చారిత్రాత్మక ఘట్టమని మంత్రి పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా వేలాది కుటుంబాలకు ఉపాధి అవకాశాలు లభించడంతో పాటు, రాయలసీమ పారిశ్రామిక ప్రగతికి కొత్త దిశ లభిస్తుందన్నారు. పెట్టుబడులను ఆకర్షించడం, పరిశ్రమలకు అనుకూల వాతావరణం కల్పించడం, యువతకు ఉపాధి అవకాశాలను సృష్టించడం అనే లక్ష్యాలతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దూరదృష్టితో పనిచేస్తున్నారని మంత్రి కొనియాడారు. రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం వేగంగా నిర్ణయాలు తీసుకుంటూ, పెట్టుబడిదారుల విశ్వాసాన్ని గెలుచుకుంటోందని తెలిపారు. రాయలసీమ ప్రజల చిరకాల ఆకాంక్ష అయిన భారీ ఉక్కు పరిశ్రమ ఏర్పాటు దిశగా వేగంగా అడుగులు పడుతున్నాయని, ఈ ప్రాజెక్టు రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి, యువత భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తుందని వారు తెలిపారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని పారిశ్రామికంగా, ఆర్థికంగా మరింత బలోపేతం చేసే దిశగా ఇదే ఉత్సాహంతో ముందుకు సాగుతుందని తెలిపారు.



### భక్తీ శ్రద్ధలతో
## వెంకన్న ప్రాకారోత్సవం



**వేంపల్లి జూలై 05 ప్రభాతవార్త**
వేంపల్లెలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం భక్తీ శ్రద్ధలతో శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామివారి ప్రాకారోత్స వం నిర్వహించామని ఆలయ ఈఓ శుభాష్,పాలకమండలి ఛైర్మన్ పీవీ రమణ తెలిపారు. ఆలయ అర్చకులు హరిప్రవీణ్, తిరుమల వేణు స్వాముల నేతృత్వంలో స్వామి అమ్మవార్లను పల్లకిపై కొలువుతీర్చి ఆస్థానం పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు పల్లకిని భుజాలపై పెట్టుకొని అర్చకుల వేద మంత్రోచ్ఛణతో మంగళవాయిద్యాలు,మహిళల కోలాటం నడుమ గర్భగుడి చుట్టూ ప్రాకారోత్స వం చేశారు. తాత్కాలిక ఉభయదారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారిని సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు వరాలు, రెడ్డయ్య, ఆలయ సిబ్బంది సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



### తప్పులులేని
## ఓటర్ల జాబితా రూపొందించాలి
**జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్**


సర్ కార్యక్రమాలను పరిశీలిస్తున్న కలెక్టర్

**మదనపల్లె, జులై 5 ప్రభాతవార్త :**
ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని పటిష్టంగా పూర్తి చేసి, తప్పులు లేని ఓటరు జాబితాను రూపొందించాలని జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్ తెలిపారు. ఆదివారం మదనపల్లె రూరల్ మండలం చిప్పిలి, కురబలకోట మండల కేంద్రాల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ బూతులెవల్ అధికారులు(బిఎల్‌ఓ)లు ఇంటింటికి వెళ్ళి నిర్వహిస్తున్న సర్వే, ఎస్ఐఆర్ ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణి, ఓటరు వివరాల నమోదు, డిజిటలైజేషన్ ప్రక్రియను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రతి అర్హత కలిగిన ఓటరు పేరు, ఓటరు జాబితాలో ఉండేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. ప్రతి ఇంటిని సందర్శించి అర్హులైన ఓటరు వివరాలను పూర్తిస్తాయిలో నమోదు చేయడంతో పాటు కొత్తగా అర్హత పొందిన వారు, ఇతర ప్రాంతాలకు మారిన వారు, మరణించిన వారి వివరాలను నిబంధనల ప్రకారం నమోదు చేయాలని సూచించారు. సేకరించిన సమాచారాన్ని ఆలస్యం చేయకుండా ఆన్‌లైన్‌లో డిజిటైలేజన్ చేసి ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. బిఎల్‌ఓలకు అప్పగించిన విధులను వారే వ్యక్తిగతంగా నిర్వహించాలని తెలిపారు. ఓటర్లు, బూత్‌లెవెల్ ఏజెంట్లు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమానత్వం, నిష్పక్షపాతను పాటిస్తూ గర్వించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్దకు వచ్చే ప్రజలకు సహాయసహకారాలు అందించాలన్నారు. ఈకార్యక్రమంలో సబ్‌కలెక్టర్ చల్లా కల్యాణి, తహశీల్దార్లు మాధవి, రామాంజనేయులు, బిఎల్‌ఓలు పాల్గొన్నారు.

# దారి తప్పిన ఏనుగుల బీభత్సం..
### మామిడి తోటలు, పంటలకు భారీ నష్టం





**పీలేరు,కె.వి.పల్లి, జూలై 5 ప్రభాతవార్త:**
నియోజకవర్గంలోని కేవీ పల్లె మండలంలోని జిల్లెల్లమంద పంచాయతీ పరిధిలో దారి తప్పిన ఏనుగుల గుంపు బీభత్సం సృష్టించింది. పెద్ద తాండ, బసన్నగారిపల్లి, గజ్జలగుట్ట తాండ, కన్నెమడుగు ప్రాంతాల్లో సంచరించిన ఏనుగులు రైతుల మామిడి తోటలు, వరి పొలాల్లోకి చొరబడి తీవ్ర నష్టం కలిగించాయి. స్థానికుల కథనం ప్రకారం, ఏనుగులు మామిడి చెట్లను విరగొట్టడంతో పాటు టెంకాయ చెట్లను నేలకూల్చాయి. పొలాలకు ఏర్పాటు చేసిన ముళ్ల కంచెలను ధ్వంసం చేసి, నీటి సరఫరా కోసం వేసిన పైపులను తొక్కేయడంతో అవి విరిగిపోయాయి. దీంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఇప్పటికే సాగు ఖర్చులతో ఇబ్బందులు పడుతున్న సమయంలో ఈ ఘటన మరింత నష్టాన్ని మిగిల్చిందని బాధిత రైతులు వాపోతున్నారు. ఏనుగుల సంచారం కారణంగా గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. రాత్రి వేళల్లో పొలాల వద్దకు వెళ్లేందుకు కూడా జంకుతున్నామని, ఏనుగులు ఇంకా సమీప అటవీ ప్రాంతాల్లోనే సంచరిస్తున్నాయనే భయంతో అప్రమత్తంగా ఉన్నామని స్థానికులు తెలిపారు. సమాచారం అందుకున్న అటవీ శాఖ అధికారులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని నష్టాన్ని పరిశీలించారు. రైతుల నుంచి వివరాలు సేకరించి, పంటలు, తోటలకు జరిగిన నష్టాన్ని అంచనా వేస్తున్నారు. అలాగే ఏనుగుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచి, వాటిని సురక్షితంగా అటవీ ప్రాంతానికి మళ్లించే చర్యలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. అటవీ శాఖ అధికారుల ప్రాథమిక అంచనా ప్రకారం, దారి తప్పిన ఈ గుంపులో సుమారు ఆరు నుంచి ఎనిమిది ఏనుగులు ఉన్నట్లు భావిస్తున్నారు. గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని, ఏనుగులు కనిపించిన వెంటనే అటవీ శాఖకు సమాచారం అందించాలని అధికారులు సూచించారు. రైతులకు జరిగిన నష్టంపై ప్రభుత్వం తగిన పరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.

### తాగిన మత్తులో పోలీస్ స్టేషన్ల వద్ద
# హల్‌చల్

**సీఐ వాహనాలపై రాళ్లు, కట్టెతో దాడి**

**రెండు వాహనాల అద్దాలు ధ్వంసం**

**పోలీసులపై ఎదురుదాడి... చివరకు అదుపులోకి**


అద్దాలు పగిలిన వాహనం

**పులివెందుల, జూలై 5, ప్రభాతవార్త :**
పట్టణంలోని అర్బన్, రూరల్ పోలీస్ స్టేషన్ల వద్ద శనివారం ఓ వ్యక్తి మద్యం మత్తులో వీరంగం సృష్టించి పోలీసులకు కొంతసేపు చుక్కలు చూపించిన ఘటన కలకలం రేపింది. పోలీసు అధికారుల వాహనాలపై కట్టెతో దాడి చేసి అద్దాలు ధ్వంసం చేయడంతో పాటు, అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించిన పోలీసులపై రాళ్ల విసరడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సమాచారం ప్రకారం, తొండూరు మండలం కోరవాండ్లపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి శనివారం ఉదయం నుంచే మద్యం సేవించి మత్తులో ఉన్నాడు. తన గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు సుమో వాహనాల్లో తనను చంపేందుకు వెంబడిస్తున్నారని చెబుతూ ముందుగా పులివెందుల అర్బన్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లాడు. అతడి గ్రామం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోకి రావడంతో అక్కడ ఫిర్యాదు చేయాలని పోలీసులు సూచించారు. అనంతరం రూరల్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన వ్యక్తి తనను చంపేందుకు వస్తున్నారని చెప్పినా, ఎవరనే విషయంపై స్పష్టమైన వివరాలు ఇవ్వలేకపోయాడు. దీంతో పోలీసులు అతడి ఎర్యాదును నిర్ధారించేందుకు ప్రయత్నించారు. సాయంత్రం వరకు పోలీస్ స్టేషన్ల పరిసరాల్లో తిరిగిన వ్యక్తి ఒక్కసారిగా ఆగ్రహానికి లోనై రూరల్ సీఐ అధికారిక వాహనంపై కట్టెతో దాడి చేసి అద్దాలు ధ్వంసం చేశాడు. అనంతరం అర్బన్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి అక్కడ సీఐ అధికారిక వాహనంపైనా దాడి చేయడంతో ఆ వాహనం అద్దాలు కూడా పగిలిపోయాయి. అతడిని అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించిన పోలీసు సిబ్బందిపై రాళ్ళు, బండరాళ్లతో ఎదురుదాడికి దిగడంతో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. పోలీసులు అప్రమత్తంగా వ్యవహరిస్తూ అతడిని చుట్టుముట్టే ప్రయత్నం చేయగా, నిరంతరం రాళ్లు విసురుతూ ప్రతిఘటించినట్లు సమాచారం. చివరకు రాళ్లు అయిపోవడంతో ఒక్కసారిగా చుట్టుముట్టి వ్యక్తిను అదుపులోకి తీసుకున్నారు. అదుపులోకి తీసుకున్న తర్వాత కూడా తప్పించుకునేందుకు యత్నించినప్పటికీ పోలీసులు అతి కష్టంపై అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. మొదట అతడి మానసిక పరిస్థితిపై అనుమానం వ్యక్తం చేసిన పోలీసులు, అనంతరం మద్యం మత్తులోనే ఈ విధంగా ప్రవర్తించినట్లు గుర్తించినట్లు సమాచారం. ప్రస్తుతం ఓ వ్యక్తి పోలీసుల అదుపులో ఉన్నాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం, విధుల్లో ఉన్న పోలీసుల విధులకు ఆటంకం కలిగించడం తదితర నేరాలకు సంబంధించిన చట్టాల కింద చర్యలు తీసుకునే అవకాశం ఉందని సమాచారం. అధికారిక వివరాలు వెల్లడి కావాల్సి ఉంది.

## వేరుశనగ గడ్డికి డిమాండ్

**దువ్వూరు, జూలై 05, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని వివిధ ప్రాంతాలలో మార్చి, ఏప్రిల్ నెలలో సాగు చేసిన వేరుశనగ పంట దిగుబడి వచ్చింది. ప్రస్తుతం వేరుశనగ కాయలు వేరు చేసిన తర్వాత వేరు శనగ గడ్డికి మంచి డిమాండ్ ఏర్పడింది. మార్చి, ఏప్రిల్ మాసంలో సుమారు దువ్వూరు మండలంలో 20 ఎకరాల్లో వేరుశనగను సాగు చేశారు. ప్రస్తుతం పొలం నుండి వేరుశనగను తీస్తున్నడంతో ఎకరాకు సుమారు 25 నుండి 30 బస్తాల వరకు కాయలు కాస్తున్నాయి. అయితే వేరుశనగ గడ్డికి ఇతర ప్రాంతాల వారు వచ్చి ఇక్కడ కొనుగోలు చేస్తున్నారు. ఎకరా వేరుశనగ గడ్డి సుమారు 10వేల రూపాయల వరకు పలుకుతుందని రైతులు తెలిపారు. ఎక్కువగా జమ్మలమడుగు, మైలవరం తదితర ప్రాంతాలలో పశువులు, జీవాలు కలిగిన రైతులు వేరుశనగడ్డిని కొనుగోలు చేస్తున్నారు. 10 రోజుల క్రితం ఎకరా 8 వేలు ఉండగా ప్రస్తుతం 10వేల రూపాయలు పలుకుతుంది. వేరుశనగ కాయలు దిగుబడి తక్కువ ఉన్న వేరుశనగ గడ్డికి కొద్దిగా డిమాండ్ రావటంతో రైతులకు మేలు కలుగుతుంది. ఇతర ప్రాంతాలకు చెందిన రైతులు ట్రాక్టర్ లతో వేరుశనగ గడ్డిని తరలిస్తున్నారు.



### జగన్ హయాంలో రాజంపేట
## మున్సిపాలిటీ అభివృద్ధి శూన్యం
**టిడిపి అసెంబ్లీ ఇన్చార్జ్ జగన్మోహన్ రాజు**


టిడిపిలో చేరిన మహిళలతో జగన్మోహన్ రాజు

**రాజంపేట, జూలై 5 ప్రభాతవార్త**
ఐదేళ్ల వైకాపా పాలనలో రాజంపేట అభివృద్ధి ఏమాత్రం జరగలేదని టిడిపి రాజంపేట అసెంబ్లీ ఇన్ చెమట్టి జగన్మోహన్ రాజు విమర్శించారు. ప్రజల సమస్యలు తీర్చే దిక్కు లేకుండా పోయిందని ధ్వజమేత్తారు. రాజంపేట పట్టణం ముకుందార గడ్డ వీధి యూనిట్ ఇన్చార్జ్ మహమ్మద్ అలీ ఆధ్వర్యంలో జరిగిన ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తెలుగుదేశం పార్టీలోకి చేరిన పలువురు మహిళలు యువకులను పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీతాలు తీసుకుంటూ అసెంబ్లీకి వెళ్ళని ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి అని విమర్శించారు. రాజంపేట పట్టణ అభివృద్ధిని పాలకవర్గం పట్టించుకోలేదన్నారు. రెండు మాసాల్లో మొదలుకానున్న ప్రత్యేక అధికారుల పాలనతో మున్సిపల్ పరిధిలోని ప్రజల కష్టాలు గట్టెకుతాయన్నారు. రాజంపేట అభివృద్ధి బాధ్యత కూటమి ప్రభుత్వానిదే అన్నారు. ఇప్పటికే పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేసి చూపించాం అన్నారు. ఉచితం మంచినీటి కేంద్రాలు ఏర్పాటు చేశామని, రోడ్లు మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యతను ఇస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమం పట్ల ఆకర్షితులై పలు కుటుంబాలు టిడిపిలో చేరాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ గన్నె సుబ్బ నరసయ్య నాయుడు, వైస్ చైర్మన్ చంగల్ రాయుడు, పట్టణ అధ్యక్షులు దగ్గుబాటి సుబ్రహ్మణ్యం నాయుడు, పార్లమెంట్ అధికార ప్రతినిధి దొంతం శివప్రసాద్, మున్సిపల్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ తుపాకుల అశోక్, కౌన్సిలర్ గుణకల చిన్న, రాజేష్, జానీ , మాజీ కౌన్సిలర్ చంద్రమోళి, మాజీ రాష్ట్ర కార్యదర్శి ఇడిమడకల కుమార్, మండల అధ్యక్షులు రవికుమార్ నాయుడు, పార్లమెంట్ కార్యాలయ కార్యదర్శి ఎస్కే కరీంమ్, పట్టణ ప్రధాన కార్యదర్శి అడపాల శ్రీనివాసులు, పట్టణ క్లస్టర్ ఇంచార్జ్ కొల్లి రెడ్డయ్య నాయుడు, డాక్టర్ నవీన్ కుమార్, తెలుగు యువత పట్టణ అధ్యక్షులు నూకల రమేష్ రాయల్, మేక నర్సింలు, చినేపల్లి హరీష్ కుమార్, బాలాజీ నాయుడు, పాండురాజు పరశురాం నాయుడు పాల్గొన్నారు.

# ఉన్నత విద్యావంతులను ప్రోత్సహించండి

**ప్రొద్దుటూరు జులై 5 ప్రభాతవార్త :**
తొగటవీర క్షత్రియ కులలోని పేద ఉన్నత విద్యావంతులను ప్రోత్సహిస్తే ఆర్థికంగా కుటుంబాలు బాగుపడతాయని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ సూచించారు. ఆదివారం స్థానిక తొగట వీర క్షత్రియ కళ్యాణ మండపంలో కడప జిల్లా తొగట వీర క్షత్రియ సేవా సంఘం కార్యవర్గ కమిటీ కార్యవర్గ కమిటీ ప్రమాణ స్వీకారోత్స వంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మోడెం వీరాంజనేయ ప్రసాద్ సమక్షంలో కడప జిల్లా తొగట వీర క్షత్రియ సంఘం అధ్యక్షుడిగా బండారు సూర్యనారాయణ, కార్య నిర్వాహక అధ్యక్షులుగా చౌడం జొల్లు కొండయ్య, ప్రదాన కార్యదర్శిగా బొల్లు సోమశేఖర్, కోశాధికారిగా పల్లా భాస్కర్, కార్యనిర్వాహక కార్యదర్శిగా సుంకర రామచంద్రుడు, కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. కాగా ముఖ్య అతిధిగా పాల్గొన్న కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఒక్క మనిషి తన తల్లి దండ్రులను కానీ, కులాన్ని గానీ నిర్ణయించుకోలేరని, అది భగవంతుని ఇష్టమని తెలిపారు. ఏ కులంలో పుట్టినా పేద, ధనిక తేడా లేకుండా కులస్తులంతా ఐకమత్యంగా వుంటూ కులభాందవులకు సమస్యలు వస్తే సహకరించాలని వివరించారు. ప్రతి ఒక్కరూ వారి కులంలో బాగా చదివే పేద విద్యార్థులకు ఉన్నత విద్య విషయంలో సహకరించాలని సూచించారు. కాగా కడప జిల్లా తొగట వీర క్షత్రియ కుల బాంధవుల ఐకమత్యం, ఆదరాభిమానాలు మరవలేనివన్నారు. కడప కన్నా కులస్తులు అనంతపురం జిల్లాలో అధికంగా వున్నా, ఇక్కడితో పోలిస్తే ఆదరాభిమానాలు కాస్త తక్కువన్నారు. ఇదే ఐకమత్యం తో ముందుకు సాగాలని సూచించారు. నూతన జిల్లా కార్య వర్గానికి శుభాభినందనలు తెలుపుతూ భవిష్యత్తులో సంఘం అభివృద్ధికి, బలోపేతానికి కృషి చేయాలని తెలిపారు. అనంతరం కడప జిల్లా తొగట వీర క్షత్రియ సంఘం అధ్యక్షుడు బండారు సూర్యనారాయణ మాట్లాడుతూ కడప లో ఇటీవల జరిగిన సంఘం జిల్లా అధ్యక్షుని ఎన్నికలలో తనను గెలిపించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. గతంలో తాను జిల్లాలోని చాలా నియోజకవర్గ, మండల కమిటీలు పూర్తి చేయలేక పోవడం బాధాకరమని తెలిపారు. కాగా ప్రస్తుతం వున్న కార్యవర్గ సభ్యులు గత పాలకవర్గం కన్నా మరింత నిబద్ధతతో పని చేయగల వారని, కావున వీరందరి సహకారంతో ఈ పదవీ కాలంలో తాను జిల్లాలో ప్రతి నియోజకవర్గం, మండల స్థాయిలో తొగట వీర క్షత్రియ సంఘం కమిటీ ఏర్పాటు చేస్తానని స్పష్టం చేశారు. కాగా ప్రతి కులబాంధవుడు వారి అనువైన సమయంలో సంఘం అభివృద్ధి కోసం పనిచేయాలని సూచించారు. తొలుత మండల, నియోజకవర్గ స్థాయిలో పనిచేసి సంఘం విధివిధానాలు తెలుసుకొని బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహిస్తే భవిష్యత్తులో జిల్లా సంఘం లో అవకాశం వుంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత తొగట వీర క్షత్రియ సంఘం ఉపాధ్యక్షులు బండారు రఘురామయ్య, మహిళా నాయకురాలు జయశ్రీ, సంఘం నాయకులు, జిల్లా వ్యాప్తంగా తొగట వీర క్షత్రియ కులబాంధవులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## శిల్పారామంలో ఆటపాట..

**కడప కార్పొరేషన్ జూలై 5 ప్రభాతవార్త**
కడప శిల్పారామంలో సా. 6.30 గం.లకు సాంస్కృతిక కళావేదిక మీద పద్మాకర్ వారి సహకారంతో కడప నగరానికి చెందిన మిను డాన్స్ అకాడమీ బృందంవారు, పల్లె జానపద నృత్యాలతో, శాస్త్రీయ నృత్యాలతో, సినీ నృత్యాలతో అబ్బురపరిచే విధంగా ప్రేక్షకులును ఎంతగానో అల్లరించినాయి. లవ్ యు లవ్ యు టూ, పారే గోదారి, రౌడీ బేబీ పాటలు ప్రేక్షకులను అలరించాయి. సంస్కృతి కార్యక్రమాలను శిల్పారామం పరిపాలన అధికారి పి. శివ ప్రసాద్ రెడ్డి పర్యవేక్షి ంచారు.



## వైద్య ఆరోగ్య శాఖ రీజినల్ డైరెక్టర్‌ను సన్మానించిన ఏపి ఎన్జీజివో సంఘం నాయకులు..



**కడప కార్పొరేషన్ జులై 5 ప్రభాతవార్త:**

వైద్య ఆరోగ్య శాఖ రీజినల్ డైరెక్టర్ (జోన్4, కడప) గా నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన శ్రీమతి డాక్టర్ గీతా బాయ్ ని కడప జిల్లా ఏపి ఎన్జీజివో అసోసియేషన్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కడప జిల్లా ఏపి ఎన్జీజివో అసోసియేషన్ అధ్యక్షులు బి.శ్రీనివాసులు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలపై నూతన డైరెక్టర్‌తో చర్చించినట్లు తెలిపారు. ఉద్యోగుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిశీలించి, త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. జోన్4 పరిధిలోని వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగుల సమస్యలను నూతన ఆర్డీ గారి దృష్టికి తీసుకెళామని, వాటి పరిష్కారానికి ఆమె సానుకూలంగా స్పందించారని వెల్లడించారు. అలాగే ఏ ఎన్ యం నుండి స్టాఫ్ నర్స్ గా పదోన్నతి కల్పించినందుకు డైరెక్ట్ డాక్టర్ గీతా బాయ్ కి ధన్యవాదములు తెలిపారు. ఈ మర్యాదపూర్వక కలయికలో అసోసియేషన్ నాయకులు అన్నమయ్య జిల్లా అధ్యక్షులు వేణుగోపాల్ రెడ్డి, కడప జిల్లా కార్యదర్శి పి. నిత్యపూజయ్య, కడప జిల్లా ఉపాధ్యక్షులు బాలపుల్లయ్య, సిద్దయ్య, జాయింట్ సెక్రటరీ పద్మనాభరావు, చిన్నయ్య, సునీతా, సుకుమార్, నరేష్, శేఖర్ పాల్గొన్నారు.

## ప్రత్యేక శ్రద్ధ పెట్టి పనిచేయాలి..

**కడప,జులై 05 ప్రభాతవార్త:**

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ పై ప్రత్యేక శ్రద్ధ పెట్టి పని చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు.ఆదివారం టెలి కాన్ఫరెన్స్ ద్వారా ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ నిర్వహణ పై జిల్లా కలెక్టర్ ఆర్‌డిఓలు, తహసీల్దార్‌లతో సమీక్షించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఓటరు జాబితా పారదర్శకంగా, తప్పులు లేకుండా చేయాలని ఆదేశించారు. జిల్లాలో జరుగుతున్న ఇంటింటా సర్వేని మరియు ఓటరు మ్యాపింగ్ ప్రక్రియను అధికారులుపరిశీలించాలన్నారు.అర్హులైన ప్రతి ఒక్కరూ తమ వివరాలను సక్రమంగా నమోదు చేసు కొనేలా అవగాహన కల్పించాలని తెలిపారు. ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియ నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని, ఈ గడువు లోపల బియల్‌ఓలు వారికి అందిన ఎన్యూమరేషన్ ఫారాలను పూర్తిగా పరిశీలించి డిజిటలైజేషన్ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ఓటర్లు సహాయ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఓటర్లు వారికి సమీపంలోనిసర్ సహాయ కేంద్రాన్నిసందర్శించి, ఎ న్యూమరేషన్ ఫారంను పూరించి అందజేయాలని తెలిపారు. ఫారం పూరిం చడంలో మరియు డిజిటలైజేషన్ ప్రక్రియలో ఓటర్లు సహాయం పొందవచ్చున ని,పూర్తిగా నింపిన ఎన్యూమరేషన్ ఫారంను మీ బూత్ లెవల్ ఆఫీసర్‌కు వెం టనే అందజేయాలని తెలిపారు.

# గ్రామాల్లో చిరుధాన్య విప్లవం



**చేయి చేయి కలిపితే చేతకానిది ఏముంటుంది? వీళ్లదీ అదేమాట. ఐదువేలమంది మహిళలు కాయగూరలు పండించి నగరాలకు ఎగుమతి చేశారు. ఫర్నిచర్ తయారుచేసి పట్టణాలకు పంపించారు. తాజాగా చిరుధాన్యాలని సామాన్యులకు చేరవచేస్తూ ఆరోగ్యానికి పట్టం కడుతున్నారు.** జనగామ జిల్లాలోని కాకతీయ మహిళా సహకార సంఘం ఏం చేసినా అది తోటివారికి స్ఫూర్తినిస్తూనే ఉంది. కొవిడ్ తరవాత స్టేషన్‌ఘన్‌పూర్ ప్రాంతంలోని పల్లెల్లో ఒక కార్పొరేట్ సంస్థ సర్వే నిర్వహించింది, ఆశ్చర్యంగా ఒక్క తాటికొండ గ్రామంలోనే 600 బిపి, షుగర్ వ్యాధిగ్రస్థులున్నట్టు ఆ సర్వేలో తేలింది. ఈ విషయం తెలుసుకున్న కాకతీయ మహిళా సహకార సంఘం సభ్యులు.. అనారోగ్యం నుంచి కోలుకోవడానికి చికిత్సతో పాటు చిరుధాన్యాలతో స్వీట్లతో సహా అన్ని రకాల వంటలూ చేసుకోవచ్చని ముందుగా తమ సంఘ సభ్యులకే అవగాహన కల్పించారు. ఆ తరవాత నుంచీ మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్ వంటిచోట్ల సేంద్రియ పద్ధతుల్లో పండించిన జొన్నలు, రాగులు, సజ్జలను నెలకోసారి లారీల్లో ఘున్‌పూర్ తెప్పించుకుంటున్నారు. సొంతంగా గిర్నీలు, మరమిల్లులు ఏర్పాటు చేసుకుని చిరుధాన్యాలని మర పట్టిస్తున్నారు. గ్రామాల్లో చిన్నచిన్న దుకాణాలు ఏర్పాటు చేసి బయటకన్నా పది రూపాయలు తక్కువకే పిండి, రవ్వ అమ్ముతు న్నారు. ప్రస్తుతం వీరు 75 గ్రామాల్లో ప్రతి నెలా జొన్న, రాగి, సజ్జ పండి, రవ్వలతోపాటు గోధుమలను విక్రయిస్తూ అరోగ్యానికి పట్టం కడుతున్నారు. ఇంతకీ వీళ్ల ప్రయాణం ఎలా ప్రారంభమైందంటే 22 ఏళ్ల నక్రితం గ్రామీణ మహళల శక్తిని ప్రపంచానికి చాటేందు వెంకటస్వామి స్టేషన్‌ఘన్‌పూర్ మండల కేంద్రంలో 12 మంది సభ్యులతో కాకతీయ మహిళా మాక్స్ లిమిటెడ్‌ను ఏర్పాటు చేశారు. వీరంతా నెలకు రూ.పది నుంచి రూ.50 వరకు పొదుపు చేస్తూ ఆర్థికంగా బలపడ్డారు. క్రమంగా వీళ్ల పొదుపు కోట్ల రూపాయలకు చేరుకుంది. అలా అలా ఒకరి నుంచి ఒకరు స్ఫూర్తి పొందుతూ 75 ఊళ్లలో 5200 మంది సభ్యులు ఈ సంఘంలో చేరారు. పొదుపు సొమ్ముతో మొదట వీళ్లు ఒక సూపర్ మార్కెట్ ప్రారంభించారు. ఆ తరవాత వ్యాపారంలో చురుకుగా ఉండేందుకు కంప్యూటర్ శిక్షణ తీసుకున్నారు., 2018లో సేంద్రియ కూరగాయలు పండించి హైదరాబాద్‌కు మొత్తంలో ఎగుమతి చేసేవారు. సంఘంలోని ఒంటరి మహిళలువడ్రంగం పనిలో శిక్షణ తీసుకున్నారు.గుమ్మాలు, కిటికీలు, డైనింగ్ టేబుళ్ల కంప్యూటర్ టేబుల్ చేసి ఉపాధి పొందుతున్నారు. అలా అంచెలంచెలుగాఎదుగు తున్న ఈ సంఘం ప్రస్తుతం చిరుధాన్యాల ఉత్పత్తులతోనూ దూసుకెళ్లోంది.

## బద్వేలు ఆర్టీసీ డిపోలో ఏపిపిటిడి ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయం ప్రారంభం



**బద్వేల్ అర్బన్, జూలై 5 ప్రభాతవార్త**

బద్వేలు ఆర్టీసీ డిపో ఆవరణలో ఏపిపిటిడి (ఆర్టీసీ) ఎంప్లాయిస్ యూనియన్ డిపో కమిటీ సొంత నిధులతో నిర్మించిన నూతన యూనియన్ కార్యాలయాన్ని ఆదివారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వి. నరసయ్య, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ వి. వెంకటేశ్వర్లు, జోనల్ కార్యదర్శి ఎన్. రాజశేఖర్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, వివిధ డిపోల యూనియన్ నాయకులు, సభ్యులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వి. నరసయ్య మాట్లాడుతూ, ఉద్యోగుల ఐక్యతకు ప్రతీకగా నిలిచేలా సొంత నిధులతో కార్యాలయాన్ని నిర్మించడం అభినందనీయమని పేర్కొన్నారు. జూలై 7, 8 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న నిరసన బ్యాడ్జీల కార్యక్రమాలను ప్రతి డిపోలో విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ నిధులతోనే ఆర్టీసీకి విద్యుత్ బస్సులు కొనుగోలు చేయాలని, ప్రైవేటు భాగస్వామ్యంతో ఈబస్సులను ప్రవేశపెట్టడం సంస్థ భవిష్యత్తుకు ప్రమాదకరమన్నారు. విద్యుత్ బస్సుల కోసం మూసివేసిన నెల్లూరు2, గుంటూరు2, విద్యాధరపురం డిపోలను తిరిగి ప్రారంభించాలని, మంగళం డిపోను ఖాళీ చేయాలనే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ వి. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, "స్త్రీ శక్తి" పథకంలో ఉన్న లోపాలను సరిచేసి, ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా 4,000 కొత్త బస్సులను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. జోనల్ కార్యదర్శి ఎన్. రాజశేఖర్ మాట్లాడుతూ, డ్రైవర్లు, కండక్టర్లు, ట్రాఫిక్ సిబ్బందిపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని, అలాగే సంస్థలో ఖాళీగా ఉన్న సుమారు 10 వేల పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా నాయకులు మాట్లాడుతూ, 11వ పీఆర్సీ, డీఏ బకాయిలను వెంటనే చెల్లించి, 12వ పీఆర్సీ ప్రక్రియను ప్రారంభించాలని, పెండింగ్‌లో ఉన్న పదోన్నతులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బద్వేలు డిపో అధ్యక్షుడు కొండయ్య, కార్యదర్శి నరసింహులు, జిల్లా నాయకులు, ఎనిమిది డిపోల ప్రతినిధులు, గ్యారేజ్ నాయకులు, మహిళా ఉద్యోగులు, డిపో సిబ్బంది పాల్గొన్నారు.

## కడప-బద్వేల్ రహదారిపై రక్షణ గోడలు లేక ప్రమాదాలు

**బద్వేల్, జూలై 5, ప్రభాతవార్త**

కడప-బద్వేల్ ప్రధాన రహదారిపై పలు కల్వర్టుల వద్ద రక్షణ గోడలు (సేఫ్టీ వాల్స్) లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, దీనికి కడప జిల్లా ఆర్ అండ్ బి అధికారుల నిర్లక్ష్యమే కారణమని భారతీయ జనతా యువ మోర్చా (బీజేవైఎం) నాయకులు ఆరోపించారు. బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి బొమ్మన విజయ్ మాట్లాడుతూ, సుమారు 15 రోజుల క్రితమే ఖిజనతా వారధిఖి కార్యక్రమంలో భాగంగా జిల్లా ఆర్‌అండ్‌బి అధికారులను కలిసి, కడప-బద్వేల్ రహదారిపై ఉన్న ప్రమాదకర కల్వర్టుల వద్ద రక్షణ గోడలు నిర్మించాలని వినతిపత్రం సమర్పించినప్పటికీ ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. నిన్న రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదమే అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. అదృష్టవశాత్తూ ప్రాణనష్టం జరగలేదని, అయితే అదే సమయంలో బస్సు లేదా ప్రయాణికులతో నిండిన ఇతర వాహనం ప్రమాదానికి గురై ఉంటే భారీ ప్రాణనష్టం సంభవించే అవకాశం ఉండేదని అన్నారు. ఈ సందర్భంగా బీజేవైఎం నాయకులు పలు డిమాండ్లు చేశారు. ప్రజల ప్రాణాల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన కడప జిల్లా ఆర్ అండ్ బి సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఎస్‌ఈ), డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (డీఈఈ)లపై శాఖాపరమైన చర్యలు తీసుకుని సస్పెండ్ చేయాలని కోరారు. అలాగే రెండు రోజుల్లోగా సంబంధిత కల్వర్టుల వద్ద రక్షణ గోడల నిర్మాణాన్ని పూర్తి చేయడంతో పాటు, భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా శాశ్వత చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అధికారులు స్పందించకపోతే రాష్ట ఆర్ అండ్ బి శాఖా మంత్రి దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లి, బాధ్యులపై చర్యలు తీసుకునే వరకు బీజేవైఎం ఆధ్వర్యంలో ప్రజాస్వామ్యబద్ధంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## వైవిధ్యమైన ఫ్యాషన్ నగలు









దుస్తులూ, యాక్సెసరీల్లోనే కాదు.. పసిడి నగల్లోనూ వైవిధ్యమైన ఫ్యాషన్లను కోరుకుంటోంది ఈ తరం. అందుకే, ఇప్పుడు ఆభరణాలన్నీ ఆధునిక సొగసుద్దుకుని మరీ వారిని ఆకట్టుకుంటున్నాయి. అలాంటి వాటిల్లో ఎసెమిట్రికల్ స్టైల్ ఒకటి. నిన్నమొన్నటివరకూ సాధారణంగా డ్రెస్‌ల్లో కనిపించినఈ డిజైన్ ఇప్పుడు జ్యూయెలరీకి నిండుదనం తెస్తోంది. పాశ్చాత్యశైలినితలపిస్తూ సంప్రదాయ సౌందర్యాన్ని మరింత అందంగా ఇనుమడింపజేస్తోంది. ఎసిమెట్రికల్ ప్యాటర్న్ అంటే. నగ అంతా ఒకే తీరున ఉండకపోవడమే ! రెండు డిజైన్లను ఒకే ఆభరణంలో కలగలిపో, లేదంటే ఒక వైపున కాస్త పెద్దగా, మరోవైపున చిన్నగా ఉండేలా తీర్చిదిద్దడమో, ఇవేవీ కావంటే పెండెంట్ మధ్యకి కాకుండా కాస్త పక్కగా ఏర్పాటు చేయడమో! ఏది ఏమైనా ఈ తరహా నగలు.. ధరించినవారికి కొత్తదనాన్ని తెచ్చిపెట్టడమే కాదు చూసేవాళ్లందరినీ అయస్కాంతంలా ఆకట్టుకుంటున్నాయి. వాటిని మీరూ ఓ సారి









## పుస్తక పఠనం మంచిదే ..

కొంతమంది పిల్లలు గట్టిగా బయటకు చదివితే నెమ్మదిగా చదవలేవా అంటూ తిడుతుంటాం. కానీ ఇలా పుస్తక పఠనం చేయడం వల్ల కొన్ని ప్రయోజనాలు ఉన్నాయంటున్నారు. నిపుణులు. అవేంటంటే..

- పిల్లలు పుస్తకంలో పదాలను గుర్తిస్తూ బయటకు చదివేటప్పుడు వాటిని గుర్తుంచుకోవడానికి ప్రయత్నిస్తారు. అంతేకాదు విషయాన్ని సులభంగా గ్రహించగలుగుతారు. ఇది వారిలో జ్ఞాపకశక్తి పెంచుతుంది.
- .విని నేర్చుకునే వారిని ఆడియో లెర్నర్స్ అంటారు. ఇలాంటివారు దేన్నైనా శ్రద్ధంగా వినడానికి ప్రయత్నిస్తారు. వారిలో భాషానైపుణ్యం మెరుగుపడి చిన్నతనం నుంచే ఉచ్ఛారణ అలవాటు అవుతుంది. పదాలు సులభంగా నేర్చుకుంటారు.
- చాలామంది పిల్లలకు చదవమంటే చిరాకు వస్తుంది. అదే గట్టి చదువు అంటే మాత్రం ఎంతో హుషారుగా ఉంటారు. దీని వల్ల వారిలో ఉన్న ఒత్తిడి, ఆందోళనలు దూరం అవుతాయని అంటూన్నారు.



### చెలి చిట్కా

వామును నీళ్ళలో నానబెట్టి ఆ నీటిలో కొద్దిగా ఉప్పు కలిపి తాగితే వాంతులు తగ్గుతాయి.

## ఇంజినీరే జీవితం కాదు !



**ఎన్.బి.సుధాకర్‌రెడ్డి**
**సైకాలజిస్టు**

**ప్రశ్న :** మేము పేద వారము. పిల్లల్ని ప్రైవేటు స్కూళ్ళు, కాలేజీలలో చదివించే స్తోమత లేదు. మాకు ఒక అమ్మాయి, అబ్బాయి ఉన్నారు. అమ్మాయి పదవతరగతి పాస్ అయ్యింది. ప్రభుత్వ పాఠశాలలో చదవడం వల్ల మంచి మార్కులు తెచ్చుకోలేకపోయింది. దీనితో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సైన్స్ గ్రూపులో సీటురాలేదు. ఎలాగైనా డాక్టరు లేక ఇంజినీరు కావాలని కోరుకుంటున్నది. అయితే ఆఖరికి హెచ్.ఇ.పి గ్రూపులో సీటు వచ్చింది. అతి కష్టం మీద హాస్టల్లో కూడా సీట్లు వచ్చింది. అయితే అమ్మాయి చాలా బాధపడుతున్నది ప్రైవేటు జూనియర్ కళాశాలలో కనీసం ఎంపిసి గ్రూపులో చేరి ఇంజినీరైనా కావాలంటోంది. మాకు ఆశక్తి లేదంటే ఏడుస్తోంది. తన కర్మఖాలి మాలాంటి పేదవారికి పుట్టాను అంటోంది. ఆమె లెక్కలు, సైన్స్‌లో కొంత వెనుకబడింది. సాంఘిక శాస్త్రంలోమంచిమార్కులు వచ్చాయి. ఆమె కోరినట్లు ప్రైవేటు కాలేజీలో చేర్పించలేము. ఆర్ట్స్ గ్రూపు చదివి గుమాస్తా ఉద్యోగం చేయడం కంటే మా వృత్తి చేయడమే మేలాటోంది. తన స్నేహితులు కొందరు మంచి కాలేజీల్లో చేరారు. వారితో పోల్చుకుని బాధపడుతున్నది. కనీసం తన తమ్ముడిని అయినా మంచి పాఠశాల, కాలేజీలో చదివించమంటోంది. ఆమె మాటలు వింటే ఆస్తి మూరడు ఆశ బారెడు అన్న సామెత గుర్తుకు వస్తోంది. నేను నా భర్త పదవ తరగతి వరకు చదువుకున్నాము. అయినా ఆర్ట్స్ గ్రూపులు చదివి చాలా గొప్పవారైన వారిని గూర్చి తెలుసు. ఆ మాట చెప్పితే ఆమె వినడం లేదు. చేతకాక సామెతలు చెప్పడం ఎందుకు అంటూ ఈసరించ కుంటోంది. ఈ దశలో ఆమెలో ప్రేరణ కలిగించే మార్గం చెప్పండి.

**- ఒక సోదరి, చిత్తూరు జిల్లా**



**జవాబు :** అమ్మా మీ సమస్య అర్థం అయింది. చాలా మంది విద్యార్థులు, యువకులు ఆలోచనా విధానాలలో లోపం ఉంది. ఆశమూరెడు అర్హత చిత్తేడు అన్నట్లు మాట్లాడుతుంటారు. పోటీ ప్రపంచంలో రాణించేందుకు నిరంతరం కృషి చేయక తప్పదు. ప్రభుత్వ పాఠశాలలో చదివితే మార్కులు రావు అన్నది నిజం కాదు. నిజానికి ప్రైవేటు పాఠశాలలకంటే ప్రభుత్వ పాఠశాలల్లో పని చేసే ఉపాధ్యాయులకే ఎక్కువ విద్యార్హతలు ఉంటాయి. అతి కొద్ది మంది ప్రభుత్వ ఉపాధ్యాయులు నిర్లక్ష్యంగా ఉండవచ్చు నేమో కానీ అందరూ బాగానే చెపుతుంటారు. అయితే విద్యార్థుల్లో శ్రద్ధ, కృషి, తెలివితేటలు నైపుణ్యాల లోపంవల్ల చదువులో వెనకబడుతుంటారు. కొందరు కొన్ని సబ్జెక్టుల్లో రాణించి, కొన్నింటిలో వెనకబడుతుంటారు. అలాంటి వారిని తల్లిదండ్రులు ఉపాధ్యాయులు గుర్తించి సరిదిద్దాలి,. అలాగే విద్యార్థులు కూడా స్వయంప్రేరణతో లోపాలను అధిగమించే ప్రయత్నం చేయాలి. అయితే సహజ సిద్ధంగా ఉన్న తెలివి తేటలు, నైపుణ్యాలకు అనుగుణంగా కోర్సులు ఎంచుకోవడం మంచి పద్ధతి మన సమాజంలో డాక్టరు, ఇంజినీరు వృతుల పట్ల ఎక్కువ మోజు ఉంది. మిగిలిన వృత్తులను గూర్చి ఆలోచించడం మానేశారు. ఉదాహరణకు సుప్రీంకోర్టులో కొందరు సీనియర్ లాయర్లు ఒక గంట వాదించేందుకు 20 లక్షలకుపైగా తీసుకుంటారు మల్టీనేషనల్ కంపెనీలలో కీలక బాధ్యతలు నిర్వహించే వారు డాక్టర్లు, ఇంజనీరు కంటే ఎక్కువ సంపాదిస్తున్నారు. ఐఎఎస్ , ఐపిఎస్ చదివిన వారు సమాజం ఉన్నత స్థాయి వ్యక్తులుగా ఉన్నారు. వీరంతా ఆర్ట్ గ్రూపు చదివిన వారే అన్నది గుర్తుపెట్టుకోవాలి. అతికొద్ది మంది సైన్స్ చదివి ఇతర వృత్తులు చేపట్టేవారు ఉన్నారు. కాబట్టి ఇంజినీరు మాత్రమే గొప్ప కాదన్న అవగాహన కల్పించండి

వ్యథ

## పిచ్చి బఠాణీలు.. మెచ్చు గుణాలు



**తాజా బఠాణీలు..** ఆకుపచ్చ ముత్యాల్లా ఎంత అందంగా ఉంటాయి కదూ! చూస్తుంటేనే నోట్లో వేసుకోబుద్ధేస్తుంది. బఠాణీలను క్యాలీఫ్లవర్, క్యాబేజ్, బంగాళదుంప, క్యారెట్.. ఇలా దేనితో కలిపి వండినా వాటి రుచి రెట్టింపవుతుంది. బిర్యానీ, కిచిడీల్లో ఇవి గనుక లేకపోతే.. పెద్ద లోటుగానే ఉంటుంది. వీటితో స్వీట్లు, హాట్లు కూడా చేయొచ్చు. సూప్, సలాడ్ రూపంలోనూ సేవించవచ్చు. బఠాణీల్లో ఎన్ని సుగుణాలున్నాయంటే.. ఇవి.. పచ్చిబఠాణీలు ఎర్రరక్త కణాలు వృద్ధిచెందడంలో, శరీరం అంతటికీ ప్రాణవాయువును అందజేయడంలో తోడ్పడతాయి. రక్తంలో చక్కెర స్థాయిని క్రమబద్ధం చేస్తాయి. బఠాణీలు తినడం వల్ల జీర్ణ వ్యవస్థ మెరుగుపడుతుంది. తరచుగా బఠాణీలు తినేవారికి క్యాన్సర్ వచ్చే అవకాశం తక్కువ. వీటిలో ఉన్న సెపోనిన్స్ ద్రవ్యాలు క్యాన్సర్ చేరిన సూక్ష్మ క్రిములను నశింపచేస్తాయి. వీటిల్లో ఉండే కెరొటినాయిడ్స్, జిక్సాంథిన్లు కళ్లకు దీర్ఘకాలిక వ్యాధులు రాకుండా కాపాడతాయి. యాంటీఇన్‌ఫ్లమేటరీ గుణాలు రోగనిరోధక శక్తిని పెంచుతాయి. మధుమేహం, ఉబకాయం, గుండెజబ్బుల నుంచి ఉపశమనం కలిగిస్తాయి. ఇవి కొన్ని రకాల క్యాన్సర్లను సైతం నిరోధిస్తాయని పరిశోధనల్లో తేలింది. పీచు, పొటాషియం, ప్రొటీన్లు ఉన్నాయి. మాంసాహారం తినని వాళ్లకి మంచి పోషకాహారం. ఇంత మేలు చేసే బఠాణీలను విస్మరిస్తే ఎలా! తరచూ ఏదో రూపంలో తీసుకుందాం. ఆరోగ్యంగా ఉందాం కానీ అవసరమైన దాని కంటే ఎక్కువగా తింటే మాత్రం అనర్థమేనండోయ్.

## చోఖామేళా



**సాయిబాబా షిరిడీకి వచ్చినప్పుడు** ఖండేరావు గుడిలోనికి పోబోతుంటే, ఆ ఆలయ పూజారి మహల్సాపతి వారించాడు. సాయిబాబా అప్పుడు కోపం తెచ్చుకోకుండా.. నీ అభిమతాన్ని అనుసరించి నేను దూరం నుండే దర్శనం చేసుకుంటాలే! దానికి అభ్యంతరం లేదనుకుటాను. మీ పురాణాలలో ఒక కథ ఉన్నది. పంచముడైన చోఖామేళా పాండురంగనికి ప్రియమైనవాడు. పాండురంగని వద్ద పూజ చేసే పురోహితులకంటే వంద రెట్లు శ్రేష్ఠుడు. శ్రీహరి ద్వారాన్ని చేరుటకు శ్రద్ధతో ప్రయత్నంచేసేవారు తప్ప మిగిలిన అందరూ పంచములే! ఎవరి ఆంతర్యం పరిశుద్ధంగా ఉంటుందో, వాడు సర్వత్ర పరిశుద్ధుడే! అన్నాడు. మహారాష్ట్రలో చోఖామేళాను గూర్చి తెలియని వారుండరు. అతనిని పాండురంగని ఆలయంలోపలకు రానీయలేదు. కానీ అంతటా పాండురంగని చూచి మైమరచిపోయే భక్తుడు. ఒకనాడు ఒక గోడను కడుతూండగా, అది కూలటం వలన చోఖామేళా, మరి కొందరు మరణించారు. శవాలను తీయటానికి చాలా సమయం పట్టింది. సామూహిక దహనం చేశారు. నామదేవునితో పాండురంగడు 'నా భక్తుడు చోఖామేళా అతని సమాధి నా మందిరమునకు ఎదురుగా ఉండాలనే ఒకే ఒక్క కోరికతో జీవించాడు. ఆ కోర్కె తీర్చుట నా లక్ష్యం' అన్నాడు. చోఖామేళా ఎముకలను గుర్తించటం సాధ్యం కాదుకదా? అన్నాడు నామదేవు. పాండురంగడు చోఖామేళుని ఎముకలు సహితం నా నామాన్ని ఉచ్ఛరిస్తాయి అన్నాడు. నాదేవుడు ఆ ఎముకల గుట్ట దగ్గరకు వెళ్లి, ఒకొక్క ఎముకను చెవి దగ్గర పెట్టుకొని, ఏవి అయితే పాండురంగని నాకు స్మరణ చేసినవో, వాటిని ఏరి తీసుకువచ్చి, పాండురంగని ఆలయమునకు ఎదురుగా చోఖామేళా సమాధిని నిర్మించాడు. చోఖామేళుని ఎముకలు రంగని నామాన్ని ఉచ్ఛరిస్తాయి. చోఖామేళుడు వైశాఖ బహుళ పంచమినాడు (మే నెల) దేహాన్ని త్యజించాడు. సాయిదేహాన్ని త్యజించాడు. మహా సమాధిని నిర్మించాడు. బొంబాయి నివాసి యగు శ్రీమతి రుస్తుంజీ బాబా మహా సమాధిపై శిరమునుంచి బాబా నీవు జీవించి ఉన్నప్పుడు నా కష్టాలను కడతేర్చి నన్ను రక్షించినావు, ఇప్పుడు నాకు దిక్కెవ్వరు? అని రోదించగా ఆమెకు సమాధి నుండి రుస్తుంబేటా కబ్ ఆయా? అన్న మాటలు మూడుసార్లు వినిపించినవి.

**- యం.పి.సాయినాథ్**

ఆధ్యాత్మికం

## సర్ కార్యక్రమాన్ని పరిశీలించిన ఇన్చార్జ్ చమర్తి



సిద్ధవటం జూలై 5 ప్రభాతవార్త

దేశవ్యాప్తంగా ఎన్నికల కమిషన్ నిర్వహిస్తున్న ఎన్నికల సమగ్ర సర్వేలో భాగంగా ఈరోజు మండలం పెద్దపల్లి గ్రామపంచాయతీ భాకరాపేట గ్రామంలోని స్వర్ణ సచివాలయంలో మండల తహసిల్దార్ విజయ్ కుమార్, భాకరాపేట బిఎల్ఓలతో మరియు గ్రామ టిడిపి నాయకులతో మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న సర్ రిపోర్ట్ గురించి అడిగి తెలుసుకున్నారు. డిజిటలైజేషన్ పర్సంటేజ్ పెరిగేందుకు అందరూ సహకరించాలని ఓటరుకు ఓటు భద్రత కల్పించవలసిన బాధ్యత మన మీద ఉందని ఇంచార్జ్ శ్రీ చమర్తి జగన్మోహన్ రాజు తెలియజేశారు. అదేవిధంగా మండలంలో 53!! డిజిటలైజేషన్ జరగడం వల్ల సంతోషం వ్యక్తం చేశారు. ఇదేవిధంగా గట్టిగా పనిచేసి గడువు లోపల ప్రతి ఓటరు సమగ్ర సర్వేలో పాల్గొనే విధంగా చేయాలని దిశా నిర్దేశం చేశారు. మండల తాసిల్దార్ విజయకుమార్ మాట్లాడుతూ ఓటర్లు సమగ్ర సర్వేలో పాల్గొనే విధంగా చేసి వారి ఓటును భద్రపరచడం లక్ష్యంగా బిఎల్వోలు అందరూ పనిచేస్తున్నారని తెలియజేశారు ఈ కార్యక్రమానికి సింగిల్ విండో చైర్మన్ దారపునేని దశరథ రామానాయుడు, స్టేట్ డైరెక్టర్ డాక్టర్ వీరభద్రుడు, భాకరాపేట యువ నాయకుడు తుర్రా ప్రతాప్ నాయుడు, మండల ఐటీడీపీ అధ్యక్షులు పెగడ హరిప్రసాద్ తదితర టిడిపి నాయకులు పలువురు హాజరయ్యారు.

## దళిత గ్రామాలలో
## కుల వివక్షతపై ప్రత్యేక శ్రద్ధ వహించండి



పీలేరు, జులై 5 ప్రభాతవార్త:

పీలేరు అర్బన్ సర్కిల్ ఇన్స్పెక్టర్గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన బి వెంకటేశ్వర్లును ఎంఆర్పిఎస్, ఎంఎస్పి పీలేరు నియోజకవర్గ ఇన్చార్జ్ గండికోట వెంకటేష్ ఎంఆర్పిఎస్, ఎంఎస్పి యువనాయకత్వంతో నూతన సిఐని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మండల పరిధిలోని ఎస్సీ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పారదర్శంగా పరిష్కరించాలని మారుమూల గ్రామాల్లో నేటికి ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన ప్రజలు అగ్రవర్ణాల చేత అనేక రకాలుగా వివక్షతకు గురవుతున్నారని గ్రామాల్లో అవేర్నెస్ ప్రోగ్రాంలు నిర్వహించి వివక్షతను రూపు మాపాలని కోరారు. సానుకూలంగా స్పందించిన సీఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మేజర్ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి మా ఎస్ఐ లోకేష్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బందితో గ్రామాల్లో వీలైనంత త్వరగా అవగాహన సదస్సు నిర్వహించి చట్టాలపై ప్రజలకు అవగాహన కలిగించి వివక్షత, అసమానతలు రూపుమాపేందుకు చర్యలు చేపడతామని గ్రామంలో ఎప్పుడు ఏ సమస్య ఉత్పన్నమైన మా దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలియజేశారు.

### పార్టీ బలోపేతానికి కృషి చేస్తా: గుండు మల్లికార్జునరెడ్డి

నందలూరు, జులై 5 ప్రభాతవార్త :

అన్నమయ్య జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధిగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా గుండు మల్లికార్జునరెడ్డి రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డి, రాజంపేట ఎమ్మెల్యే, అన్నమయ్య జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి గార్లను మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా పార్టీ తనపై ఉంచిన నమ్మకానికి కృతజ్ఞతలు తెలుపుతూ, పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేస్తానని గుండు మల్లికార్జునరెడ్డి తెలిపారు.

## ఎన్యుమరేషన్ ప్రక్రియను వేగవంతం



బద్వేల్, జులై 5 ప్రభాతవార్త :

ఈరోజు బద్వేల్ పురపాలక సంఘం పరిధిలోని సురేంద్ర నగర్ స్వర్ణ వార్డులలో జరుగుతున్న ఎస్ఐఆర్ ఎన్యుమరేషన్ ప్రక్ర ఎన్యుమరేషన్ ప్రక్రియను వేగవంతం చేయడానికి ప్రతి బీఎల్ఓకు అదనపు హెల్పింగ్ స్టాఫ్ను నియమించినట్లు తెలిపారు. ఎన్యుమరేషన్ పనులను వేగవంతంగా, పారదర్శకంగా నిర్వహించి, అర్హులైన ప్రతి ఓటరు వివరాలు ఖచ్చితంగా నమోదు అయ్యేలా ఇంటింటి సర్వేను పూర్తి చేస్తున సురేంద్ర నగర్ స్వర్ణ వార్డ్ BLOs మరియు సపోర్టింగ్ స్టాఫ్ తదితరులు పాల్గొన్నారు.

## పట్టుబడిన వాహనాలను వేలం

రాయచోటి జులై 5 ప్రభాతవార్త

రాయచోటి ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని వివిద కేస్ లలో పట్టుబడిన వాహనములను జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారి ఆద్వర్యములో 08.07.2026 వ తేదిన ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ ,రాయచోటి ప్రాంగణములో వేలము వేయబడును. ఆసక్తి గల వారు పూర్తి వివరములు కొరకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్,రాయచోటి నందు సంప్రదించగలరని ఆయన తెలపడమైనది.

ఎమ్మెల్యే గారు...

## పేదలకు భూములు ఎప్పుడు పంచుతారు

బ్రహ్మంగారి మఠం జూలై 05 ప్రభాతవార్త

మండలంలోని పేదలకు భూములు ఎప్పుడు పంచుతారని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.శివకుమార్ సిపిఎం మండలకార్యదర్శి గండి సునీల్కుమార్తో కలసి సుందరయ్య భవనంలో విలేకరుల సమక్షంలో ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్కి భూసమస్యల మీద రాసిన ఉత్తరాన్ని విడుదల చేశారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే దాదాపు 8 నెలల క్రితం మీడియా సమావేశం పెట్టి బ్రహ్మంగారిమఠం మండలంలో దాదాపు 8,వేల ఎకరాలు ప్రభుత్వ భూములు. ఆక్రమణ చేసిన వారిలో తమ పార్టీ వారు కూడా ఉన్నారని అటువంటి భూములన్నీ తిరిగి ప్రభుత్వానికి ఇచ్చేయాలని చెప్పి రెవెన్యూ అధికారులతో గోల్డెన్ సర్వే పేరుతొ బృందాలను ఏర్పాటుచేసి సర్వే ఏమైంది అని,ఎన్ని ఎకరాలు ఆక్రమణలో ఉంది అన్నది ఇంతవరకు బహిర్గతం చేయలేదని అలాంటప్పుడు ఈ ఆర్భాటం ఎందుకని వారు ప్రశ్నించారు. భూ ఆక్రమణదారులు తమ స్వాధీనంలో ఉన్న భూములను యంత్రలతో చదును చేసి పంటలు వేస్తున్నారని నకిలీ రికార్డులు సృష్టిస్తు భూమిని తమదిగా చేసుకుంటున్నారని రీసర్వే వారికి వరంలా మారిందని రీ సర్వే మొత్తం తప్పుల తడకగా మారిందని వారు ఆరోపించారు. ఎమ్మెల్యే తక్షణం స్పందించి పేదలందరికీ భూ పంపిణీ చేసే కార్యక్రమాన్ని చేపట్టాలని అన్నారు.ఈ సమావేశంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు సానా గోవిందస్వామి నాయకులు మల్లికార్జున యాదవ్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు,



## బ్రాహ్మణులకు అవకాశం ఇవ్వండి

వేంపల్లి జూలై 05 ప్రభాతవార్త



రాష్ట్రములో కాలీగా వున్న ఎమ్మెల్సీ స్థానాలకు ఎంపిక చేసే క్రమంలో బ్రాహ్మణులు కు అవకాశం కల్పించాలని బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర నాయకులు పీవీయెస్ వి ప్రసాదరావు సూగురు రఘునాథరావులు ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ స్థానాలకు అభ్యర్ధులు ఎంపిక కు ముఖ్యమంత్రి చర్యలు ప్రారంభించారు అని బ్రాహ్మణులుకు అవకాశం ఇచ్చే విధంగా పరిశీలించాలని కోరారు.ప్రస్తుత పరిస్థితిలో బ్రాహ్మణులు నేరుగా ఎన్నికలు లో పాల్గొనలేక పోతున్నారని ఆర్థికంగా బలహీనంగా ఉండటమే కారణం అన్నారు. చట్ట సభలలో బ్రాహ్మణులు కు ప్రాతినిత్యం లేదని మేధావిగా భావించి గతంలో బ్రాహ్మణులుకు అవకాశం ఇచ్చేవారని ప్రస్తుత కూడా అదేవిదంగా పరిశీలించాలని కో రారు. 1982 నుండి పార్టీ లో వున్న బ్రాహ్మణులు ఇప్పటికి పార్టీ లో వున్నారని పార్టీ కి సేవ చేస్తున్నారని అటువంటి వారిని గుర్తించాలని కోరారు. పార్టీ కోసం అన్ని విధాలుగా కృషి చేస్తున్న వారు రాష్ట్ర వ్యాప్తంగా వున్నారని అందువల్ల పార్టీ ఈ దపా బ్రాహ్మణులు కు అవకాశం ఇవ్వాలని కోరారు.

## ప్రజాస్వామ్య పరిరక్షణలో
## ప్రతి ఓటరు భాగస్వామ్యం కావాలి



పీలేరు జూలై 5 ప్రభాతవార్త:

పీలేరు ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి ఓటరు భాగస్వామ్యం కావాలని పీలేరు మండలం ముడుపుల వేముల గ్రామ ఇన్చార్జి డాక్టర్ పల్లవోలు హేమ చంద్రా రెడ్డి పిలుపునిచ్చారు. పీలేరు నియోజకవర్గ శాసన సభ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి సూచనల మేరకు ఆదివారం ముడుపుల వేముల గ్రామంలో జరిగిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ SIR కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాది. అర్హులైన ప్రతి ఒక్కరూ తమ పేరు ఓటరు జాబితాలో ఉందో లేదో పరిశీలించుకోవాలి. తప్పులు ఉంటే వెంటనే సరిదిద్దుకోవాలి. SIR ప్రక్రియను విజయవంతం చేయడానికి అధికారులకు ప్రజలు సహకరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో లాయర్ శంకర్, చంద్రయ్య, 213బూత్ ఇంచార్జ్ శ్రీనివాసులు, B.L.A లు, B.L.O లు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## 7న మదనపల్లెలో యోగి వేమన నాటకం

నాటక ప్రియులకు బాస్ ఆహ్వానం

మదనపల్లె, జులై 5 ప్రభాతవార్త :

తెలుగు సాహిత్యంలో గొప్ప నీతికవిగా ప్రసిద్ధి చెందిన ప్రజాకవి యోగి వేమన జీవిత చరిత్రపై, అభ్యుదయ ఆర్ట్స్ అకాడమి హైదరాబాద్ వారిచే 7న మంగళవారం మదనపల్లె సిఎస్ఐ కమ్యూనిటి హాలు నందు నాటకం ప్రదర్శించనున్నట్లు బాస్ వ్యవస్థాపకులు పిటిఎం శివప్రపసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. నాటక ప్రియులకు, విద్యార్థులకు ఆహ్వానం అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు. నాటకంలో వేమన పద్యాలు, ప్రజల భాషలో సలుభంగా అర్థమయ్యేలా రాగయుక్తంగా గానం చేస్తారని, మూడనమ్మకాలు, కులవివక్ష, మత ఆడంబరాలపై తన కవిత్వంలో వేమన తీవ్రంగా విమర్శించడం, సమాజంలో సమానత్వం, మానవత్వం, సత్యం, ధర్మం వంటి విలువలను బోధించడం, సామాన్య ప్రజల్లో సామాజిక చైతన్యాన్ని పెంపొందించడ, అద్భుతమైన సన్నివేశాలతో నృత్యాలు, పద్యాలు, పాటలతో నాటక ప్రదర్శన ఉంటుందన్నారు. పుర ప్రముఖులు, రచయితలు, కవులు, కళాకారులు, హాజరై నాటక ప్రదర్శనను విజయవంతం చేయాలని కోరారు.

## నేడు మదనపల్లె కలెక్టరేట్లో పిజిఆర్ఎస్

మదనపల్లె, జూలై 5 ప్రభాతవార్త :

మదనపల్లె కలెక్టరేట్లో సోమవారం ఉదయం 10గంటల నుంచి ప్రజాసమస్యల పరిష్కార వేదిక(పిజిఆర్ఎస్) నిర్వహించనున్నట్లు కలెక్టర్ నిశాంత్కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రజలు ప్రజాసమస్యలపై పిజిఆర్ఎస్లో ఆధారాలతో కూడిన అర్జీలను సమర్పించాలని కోరారు. అర్జీలపై సమాచారం కొరకు మీ కోసం కాల్సెంటర్ నెంబర్ 1100లను సంప్రదించాలన్నారు. అర్జీదారులు తమ అర్జీలను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు కూడా ఇవ్వవచ్చని సూచించారు. మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే ప్రజాసమస్యల పరిష్కార వేధిక కార్యక్రమానికి రాగలరని తెలిపారు.

## తాలూకా సిఐపై చర్యలు తీసుకోవాలి

ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు



నాయకులకు విన్నవిస్తున్న దృశ్యం

మదనపల్లె, జూలై 5 ప్రభాతవార్త :

తాలూకా సిఐ కళా వెంకటరమణపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు శ్రీచందు, భానుప్రకాష్లు కోరారు. ఆదివారం ప్రజా ఉద్యమంలో భాగంగా పట్టణంలోని అన్ని రాజకీయ పార్టీల నాయకులను కలసి చర్చించడం జరిగిందన్నారు. ఈనెల 15లోపు సిఐపై చర్యలు తీసుకోకపోతే ప్రజా ఉద్యమాన్ని చేపడుతామని హెచ్చరించారు. అన్ని రాజకీయ పార్టీలను, ప్రజాసంఘాలను ఏకంచేసే కార్యక్రమంలో భాగంగా మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేష్, బిఎస్పి రాష్ట్ర అధ్యక్షులు బందెల గౌతంకుమార్, విసికే రాష్ట్ర నాయకులు పిటిఎం శివప్రసాద్, తెలుగుయువత రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్చినబాబులు కలసి సిఐపై తీసుకోవాల్సిన చర్యలపై ప్రభుత్వానికి తెలియజేయాలని కోరడం జరిగిందన్నారు.

### యాత్రీకుల పట్ల స్నేహభావంతో మెలగాలి : ఏకాంబరం

బోయకొండ(చౌడేపల్లి), జూలై 5 ప్రభాతవార్త



సిబ్బందికి సూచనలిస్తున్న ఏకాంబరం

శక్తిక్షేత్రం బోయకొండకు తరలివచ్చే యాత్రీకుల పట్ల స్నేహభావంతో మెలగాలని ఇఒ, ఉపకమీషనర్ ఏకాంబరం అన్నారు. ఆదివారం కొండపై ఆయన వివిధ స్థాయిల్లో సేవలందించే సిబ్బందికి దిశా నిర్దేశం చేసారు. రాష్ట్రం నుంచి కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో బోయకొండ గంగమ్మ దర్శనార్థం వస్తుంటారన్నారు. అలాంటి వారిపట్ల భక్తి భావంతో మెలగాల్సిన అవసరముందన్నారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, పిల్లల పట్ల మర్యాదపూర్వంగా ఉండాలన్నారు. వీలైనంత వరకు ఆన్లైల్ టిక్కెట్లపై భక్తులకు అవగాహన కల్పించి, అమ్ముడు పోయేలా చూడాలన్నారు. క్యూలైన్లలో ఎవరికైనా సమస్య వస్తే వెంటనే స్పందించాల్సిన అవసరముందన్నారు. భక్తులు దేవుళ్ళతో సమానంగా చూసినప్పుడే ఆలయాభివృద్ధి చెందుతుందన్నారు. అనంతరం క్యూలైన్లు, చిన్న, పెద్దభోగాలు, దర్మంటరీహాలు తదితర ప్రాంతాలను సందర్శించి భక్తుల మౌళిక వసతులపై ఆరా తీశారు. కార్యాలయ సూపరిండెంట్ రామనాథం, సిబ్బంది పాల్గొన్నారు.

## కొబ్బరిచెట్టు పడి బాలికకు గాయాలు

చౌడేపల్లి, జూలై 5 ప్రభాతవార్త

ఆనందంగా ఆడుకొంటూ కేరింతలు కొడుతున్న చిన్నారులపై కొబ్బరి చెట్టు పడగా వారిలో ఒక బాలిక తీవ్రంగా గాయాలపాలైన సంఘటన చౌడేపల్లిలో చోటు చేసుకొంది. మండలంలోని పంచాయతీ కేంద్రం పెద్దకొండామర్రికి చెందిన నాగరాజ, శ్రావణిల కుమార్తె దర్శిని(7) స్థానిక ప్రాథమిక పాఠశాలలో చదువుకొంటోంది. ఆదివారం సెలవు దినం కావడంతో ఇంటికి సమీపంలోని రోడ్డు వద్ద స్నేహితులతో కలసి దర్శిని ఆడుకొంటోంది. ఒక్కసారిగా ఈదురుగాలి రావడంతో పక్కనే వున్న కొబ్బరిచెట్టు ఆడుకొంటున్న చిన్నారులపై పడింది. ఈ ప్రమాదంలో దర్శిని కాలు విరిగింది. తక్కిన పిల్లలు సురక్షితంగా బయటపడ్డారు. గాయపడ్డ బాలికను కుటుంబ సభ్యులు స్థానిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఇక్కడ పరిస్థితి విషమించడంతో 108సేవల ద్వారా మదనపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించారు.

విబిజి రాంజీ పథకం వద్దు

## ఉపాధి హామీ పథకం ముద్దు



రాయచోటి జులై 5 ప్రభాతవార్త

మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన విబిజి రాంజీ పథకం వద్దు, కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ముద్దు అని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి అన్నారు. ఆదివారం రాయచోటిలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రాలపై పెను ఆర్థిక భారం పడే విబిజి రాంజీ పథకాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆహ్వానించడం, పొగడడం దురదృష్టకరం శోచనీయమన్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పల్లె ప్రజల పాశుపతాస్త్రమని, ఈ పథకం కాంగ్రెస్ పార్టీ మానస పుత్రిక అని తులసి రెడ్డి అన్నారు. ఈ పథకం కింద కేంద్ర ప్రభుత్వము 90 శాతం నిధులు భరించేవి.రాష్ట్ర ప్రభుత్వం కేవలము 10 శాతం మాత్రమే భరించేవి. అందువల్ల రాష్ట్రాలపై ఆర్థిక భారంపడేది కాదు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఈ పథకాన్ని రద్దుచేసి దాని స్థానంలో విబిజి రాంజీ అనే నూతన పథకాన్ని ప్రవేశపెట్టింది.ఈ పథకం కింద కేంద్ర ప్రభుత్వము 60 శాతం నిధులు మాత్రమే భరిస్తుంది.రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులు భరించాలన్నారు. దీనివలన రాష్ట్రాలపై పెను ఆర్థిక భారం పడుతుందన్నారు. ఇప్పటికైనా కేంద్రంపై ఒత్తిడి తెచ్చి కొత్తగా తెచ్చిన విబిజి రాంజీ పథకాన్ని రద్దుచేసి, గతంలో అమలులో ఉన్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పునరుద్ధరించి కొనసాగించే విధంగా చర్యలు చేపట్టాలని తులసి రెడ్డి విజ్ఞప్తి చేశారు. అల్లా బకష్,సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఎస్ఎండి గౌస్, చెన్న కృష్ణ, ఖాదీర్, అజ్మతుల్లా,ఆంజనేయులు,బషీర్, అహ్మద్, రంగి, రాజు,అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న, చిన్నకోట్ల నాగరాజు, ఐచర్ రమణ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడి కేంద్రాలపై కొరవడిన పర్యవేక్షణ

ఖాజీపేట జులై 5 ప్రభాత వార్త

ఖాజీపేట మండల పరిధిలోని ముత్తులూరుపాడు సెక్టార్లోని అంగన్వాడీ కేంద్రాల నిర్వహణపై ఆరోపణలు వినిపిస్తున్నాయి. కేంద్రాలకు కొద్దిమంది పిల్లలు మాత్రమే హాజరవుతున్నప్పటికీ, రికార్డుల్లో మాత్రం ఎక్కువ మంది పిల్లలకు హాజరు నమోదు చేస్తున్నారు. నిబంధనల ప్రకారం ఉదయం 8.30 గంటలకు అంగన్వాడీ కేంద్రాలు ప్రారంభం కావాల్సి ఉండగా, కొన్ని కేంద్రాలు ఉదయం 10 గంటల వరకు కూడా తెరవడం లేదని, పిల్లలను ఇళ్ల నుంచి తీసుకురావడంలో కూడా నిరక్ష్యం వహిస్తున్నారని గ్రామస్థులు చెబుతున్నారు. అదేవిధంగా, హాజరు రిజిస్టర్లో ఎక్కువ మంది పిల్లల పేర్లు నమోదు చేసి, వారికి కేటాయించే గుడ్లు, పోషకాహారం తదితర వస్తువులు టీచర్లు ఇంటికి తీసుకెళ్తున్నారన్నా ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. దీనివల్ల చిన్నారులకు అందాల్సిన పోషకాహారం వారికి చేరడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారంపై సంబంధిత సూపర్వైజర్ పర్యవేక్షణ పూర్తిగా కొరవడిందని, ఉన్నతాధికారులు విచారణ చేపట్టి వాస్తవాలు వెలికితీయాలని, అక్రమాలు నిర్ధారణ అయితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు

## 17 మంది పేకాటరాయుళ్ల అరెస్ట్

పీలేరు, జూలై 5 ప్రభాతవార్త:

17 మంది పేకాటరాయుళ్ల అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.56 వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ లోకేష్ తెలిపారు. ఆదివారం మండలంలోని గూడరేవుపల్లె పంచాయతీ మర్రిమాకులపల్లె తాండా పరిసర ప్రాంతంలో రెండు చోట్ల పేకాట ఆడుతున్నట్లు అందిన సమాచారంతో పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో 17 మందిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి నగదు తోపాటు 13 సెల్ఫోన్లు, నాలుగు బైక్ లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## ప్రతి కుటుంబం సిరిధాన్యాల
## వినియోగాన్ని అలవాటు చేసుకోవాలి



పౌష్టికహార నిపునుడి తో మాట్లాడుతున్న దృశ్యం

పులివెందుల, జులై 5 ప్రభాత వార్త :

మారుతున్న జీవనశైలి కారణంగా ప్రజల్లో అనేక ఆరోగ్య సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి కుటుంబం సిరిధాన్యాల వినియోగాన్ని నిత్య జీవితంలో భాగం చేసుకోవాలని కడప జిల్లా తెలుగు యువత కార్యదర్శి అక్కులగారి విజయ్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. పులివెందుల సమీపంలోని రాణి తోపులో ప్రముఖ పోషకాహార నిపుణుడు డా. కాదర్ వల్లి నిర్వహించిన సిరిధాన్యాలపై అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా విజయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, సిరిధాన్యాలు మన పూర్వీకుల ఆహార సంస్కృతిలో కీలక స్థానాన్ని ఆక్రమించాయని, వాటిని మళ్లీ ప్రతి ఇంటి ఆహారంలో భాగం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆధునిక ఆహారపు అలవాట్ల వల్ల మధుమేహం, ఊబకాయం, రక్తపోటు వంటి జీవనశైలి వ్యాధులు పెరుగుతున్నాయని, సిరిధాన్యాల వినియోగం ద్వారా ఇటువంటి సమస్యలను గణనీయంగా నియంత్రించవచ్చని పేర్కొన్నారు.ప్రజల్లో ఆరోగ్య చైతన్యం పెంపొందించేందుకు సిరిధాన్యాల ప్రాధాన్యంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్న డా. కాదర్ వల్లి సేవలను ఆయన అభినం దించారు. సమాజ ఆరోగ్య పరిరక్షణలో ఇటువంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సిరిధాన్యాలను తమ నిత్యాహారంలో భాగం చేసుకోవాలని విజయ్ కుమార్ రెడ్డి ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

## నూతన ధ్వజ స్తంభం

కలసపాడు, జులై 5 ప్రభాతవార్త:

పుల్లారెడ్డి పల్లె గ్రామంలో శ్రీ రామాలయంలో నూతన ధ్వజస్తంభము , అంకాలమ్మ, పోలేరమ్మ తల్లి నూతన విగ్రహ ప్రతిష్ఠ మహోత్స కార్యక్రమము భక్తి శ్రద్ధల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానం మేరకు బద్వేల్ నియోజకవర్గ మాజీ శాసన సభ్యురాలు కె. విజయమ్మ ఈ మహోత్సవానికి విచ్చేసి, వేద మంత్రోచ్చారణల నడుమ జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని శ్రీ అంకాలమ్మ, పోలేరమ్మ, తల్లి వార్ల ఆశీస్సులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ స్టేట్ రోడ్డు డెవలప్మెంట్ డైరెక్టర్ సాధన కారీ రంతు, మండల పార్టీ అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి, శ్రావణ్, దమ్మనపల్లి ఆయకట్టు చైర్మన్ పట్టాభి రెడ్డి,మల్లికార్జునరెడ్డి, శ్రావణ్ కుమార్ రెడ్డి కృష్ణారెడ్డి, మండల నాయకులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

చికిత్స నిమిత్తం రిమ్స్ కు తరలింపు





ఒంటిమిట్ట జూలై 05 ప్రభాతవార్త

మండల కేంద్రమైన ఒంటిమిట్ట కడప చెన్నై ప్రధాన రహదారిలోని శ్రీ కోదండరామ స్వామి కళ్యాణ వేదిక ఏకశిలా గ్రాండ్ హోటల్ దగ్గర ఆదివారం కారు రెండు బైకులను ఢీకొట్టడం జరిగింది. ఈ ఘటనలో రాజంపేట కు చెందిన హుస్సేన్(45), అదే గ్రామానికి చెందిన శ్రీరాములు(33) మరొకరు నందలూరు ఎస్సీ కాలనీకి చెందిన బలరాం(53) తీవ్రంగా గాయపడ్డారు. అందిన సమాచారం ప్రకారం రాజంపేటకు చెందిన హుస్సేన్ ,శ్రీరాములు తమ అవసర నిమిత్తమై కడప వైపుకు బైకులో వెళుతున్న నేపథ్యంలో ఒంటిమిట్ట కళ్యాణ వేదిక వద్దకు వచ్చేసరికి దురదృష్టవశాత్తు తిరుపతి వైపుకు వెళుతున్న కారు ఢీ కొట్టడం జరిగింది. అదే సమయములో నందలూరు ఎస్సీ కాలనీకి చెందిన బలరాం బైకులో వెళుతూ ఉండటంతో అదే కారు ఆబైకును సైతం ఢీకొట్టడంతో ముగ్గురికి బలమైన గాయాలై తీవ్రంగా రక్తస్రావం అయింది. హుస్సేన్, శ్రీరాములకు కుడి చేతి పై తీవ్ర గాయాలయ్యాయి. మరొక వ్యక్తి బలరాముకు మోకాలు ,ఎడమ చేయి గాయమైంది. కారులో ప్రయాణిస్తున్న వ్యక్తికి మోకాలుపై గాయమైంది. జరిగిన సంఘటన తెలుసుకున్న ఒంటిమిట్ట పోలీసులు బయలుదేరి ప్రమాదం జరిగిన ప్రాంతానికి వెళ్లి కారణాలను విచారించి 108 సిబ్బందికి సమాచారం అందించడంతో సిబ్బంది నాగబాబు, భాస్కర్ తొందరగా సంఘటన స్థలికి చేరుకుని అధిక రక్తస్రావమై గాయాలతో బాధపడుతున్న నలుగురికి ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన చికిత్స నిమిత్తం కడప రిమ్స్కు తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## పుల్లారెడ్డిపల్లె జాతరలో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి



కలసపాడు, జూలై 5 ప్రభాతవార్త:

మండలం పుల్లారెడ్డిపల్లె గ్రామంలో పోలేరమ్మ పెద్దమ్మ, అరుగులు గంగమ్మ, పోలేరమ్మ, పోతురాజు స్వామి నూతన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాల 16వ రోజు సందర్భంగా ఆదివారం ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ నాయకులు ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డిని శాలువా కప్పి, పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ గురివిరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ సుదర్శన్, ఎంపీపీ నిర్మల నారాయణ, మాజీ ఎంపీపీ సుధా రామకృష్ణారెడ్డి, మాజీ సింగిల్ విండో చైర్మన్ పురుషోత్తంరెడ్డి, మాజీ సర్పంచ్ దేవసాని శ్రీనివాసులరెడ్డి, నియోజకవర్గ ఐటీ వింగ్ అధ్యక్షుడు మధుసూదన్రెడ్డి, సింగరయ్య, అంకిరెడ్డి, బాలుడు, సురేష్, పులి వీరారెడ్డి, ఖాతా సుబ్బారెడ్డి, తిరుమలరెడ్డి, విష్ణువర్ధన్రెడ్డి, ఈశ్వర్రెడ్డి, కొండ చిన్న భాస్కర్రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు , గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ సుంకుల పరమేశ్వరి
## అమ్మవారి 12వ వార్షికోత్సవం

ప్రత్యేక పూజలు, అన్నప్రసాదాల పంపిణీ

పులివెందుల, జులై 5, ప్రభాతవార్త :



పులివెందుల మండల పరిధిలోని నల్లపురెడ్డిపల్లి గ్రామంలో వెలసిన శ్రీ సుంకుల పరమేశ్వరి అమ్మవారి 12వ వార్షికోత్స వ వేడుకలు ఆదివారం భక్తి శ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించి, పుష్పాలతో సుందరంగా అలంకరించారు. వేడుకలకు పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక మొక్కులు చెల్లించుకుని ఆశీర్వాదాలు పొందారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయింది. ఉత్స వాల సందర్భంగా భక్తులు భజనలు, మంగళహారతుల్లో పాల్గొని ఆధ్యాత్మిక వాతావరణాన్ని సృష్టించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేయగా, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. ఉత్స వాల నిర్వహణలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు స్వచ్ఛందంగా సేవలందించి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## గోవధకు పాల్పడిన వారిపై కేసు నమోదు



బద్వేల్ అర్బన్ జూలై 5: ప్రభాతవార్త :

పట్టణంలోని సిద్దవటం రోడ్డు, ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న పెద్ద మసీదు వెనుక భాగంలో గోవధకు పాల్పడిన నిందితుడిపై బద్వేల్ అర్బన్ పోలీసులు కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. స్థానిక పెద్ద మసీదు వెనుక రౌఫ్ అతని సహచరులతో కలిసి గోవులను అక్రమంగా తరలించి వధిస్తున్నారనే సమాచారంతో హిందూ సంఘాల నాయకులు అక్కడకు చేరుకుని నిరసన తెలిపారు. గోవధ చేయడం చట్టరీత్యా నేరమని వారించినప్పటికీ లెక్కచేయకుండా ఆవును వధించారు. ఈ ఘటనపై విశ్వహిందూ పరిషత్, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్, భారతీయ జనతా పార్టీ, బజరంగ్ దళ్, ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘము, అఖిల భారత విద్యార్థి పరిషత్ నాయకులు, కార్యకర్తలు బద్వేలు అర్బన్ పోలీస్ స్టేషన్కు తరలివచ్చారు. నిందితులను కఠినంగా శిక్షి ంచాలని అర్బన్ ఇన్స్పెక్టర్ నాగ చిరంజీవికి వినతిపత్రం సమర్పించారు. నిందితుడైన రౌఫ్కు గతంలోనూ నేరచరిత్ర ఉందని, పలు కేసులు, బైండోవర్లు ఉన్నాయన్నారు. ఈ ఘటనపై బద్వేలు మండల తహసీల్దార్తో సంప్రదించి, వధించిన ఆవుకు పోస్టుమార్టం పరీక్షలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ ఘటనపై బద్వేల్ అర్బన్ పోలీస్ స్టేషన్లో ఎఫ్.ఐ.ఆర్ నెంబర్. 101/2026 కింద కేసు నమోదు చేసి, ప్రధాన నిందితుడిని అరెస్ట్ చేసినట్లు ఇన్స్పెక్టర్ తెలిపారు. త్వరలోనే నిందితులను రిమాండ్కు తరలిస్తామని, భవిష్యత్తులో బద్వేలు పట్టణంలో ఇలాంటి గోవధలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ఈ నిరసన కార్యక్రమంలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ బద్వేల్ ఖండ కార్యవాహ అక్కి సంజీవరెడ్డి, ఖండ సంఘటన ప్రముఖ్ సాకి ఈశ్వరయ్య, భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు అన్నపురెడ్డి అశోక్కుమార్రెడ్డి, శ్రీరాములు, బద్వేల్ పట్టణ అధ్యక్షుడు ధర్మిశెట్టి వెంకటసుబ్బయ్య, పట్టణ జనరల్ సెక్రటరీలు మేడిపోయిన ఆంజనేయులు, ముఖం శ్రీనివాస్కుమార్ రాయల్, విశ్వహిందూ పరిషత్ ప్రఖండ కార్యవాహ పత్తిపాటి నరసింహులు, పోకూరి తిరుపాలయ్య, మండల ఉపాధ్యక్షులు పెద్ది సుధాకర్, నరసింహారెడ్డి, ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘము మఠం మండలాధ్యక్షులు చెన్న కృష్ణారెడ్డి, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ సీనియర్ నాయకులు బోరెడ్డి రఘునాథరెడ్డి, కృష్ణారెడ్డి, రాజేష్, గురు ప్రసాద్, మల్లికార్జున రెడ్డి, అనాల నరసింహ ప్రసాద్, నానబాల శ్రీనివాసులు, నందగోపాల్ రెడ్డి తదితర నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## టెట్ పై భయాందోళనలు వద్దు : యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు మాదన విజయకుమార్

**బద్వేల్ అర్బన్ జూలై 05 ప్రభాతవార్త :**

ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులు టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) పై భయాందోళనలు వీడాలని యుటిఎఫ్ కడప జిల్లా అధ్యక్షులు మాదన విజయకుమార్ పేర్కొన్నారు. ఆదివారం బద్వేలులోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన టెట్ ఉచిత కోచింగ్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుప్రీం కోర్టు తీర్పు మేరకు ఎన్సీటిఈ మార్గదర్శకాలకు అనుగుణంగా 2028 ఆగస్టు 31 లోపు ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులంతా టెట్ పరీక్ష ఉత్తీర్ణత సాధించాల్సి ఉందని, దీనిపై కొందరు ఉపాధ్యాయులలో ఆందోళన నెలకొని ఉందన్నారు. విద్యాబోధన ఒకవైపు, కుటుంబ బాధ్యతలు మరొక వైపు చూస్తూ టెట్ పరీక్షకు ప్రిపేర్ కావడం ఇబ్బందికరమన్నారు. ఉపాధ్యాయుల్లో ఉన్న భయాందోళనలను పోగొట్టేందుకు యుటిఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా అన్ని తాలూకా కేంద్రాల్లో ఉపాధ్యాయులకు ఉచిత కోచింగ్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పాలకవర్గాలు సుప్రీంకోర్టు తీర్పును కారణంగా చూపి ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష ఉత్తీర్ణతను తప్పనిసరి చేయడం సహేతుకం కాదన్నారు. బోధనలో అపార అనుభవం ఉన్న ఉపాధ్యాయులను ఇప్పుడు టెట్ పరీక్ష ఉత్తీర్ణత సాధించాలనడం ఎంతవరకు సబబని వారు ప్రశ్నించారు. ఉపాధ్యాయులలో నెలకొని ఉన్న ఆందోళనను దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వంతో చర్చించి విద్యాహక్కు చట్టం 23 (1) కి సవరణ చేపట్టి ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు ఉపశమనం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆలోపు ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు స్పెషల్ టెట్ నిర్వహించాలని కోరారు. ఇన్ సర్వీస్ ఉ



పాధ్యాయులంతా టెట్ పరీక్ష పై దృష్టి కేంద్రీకరించి, సన్నద్ధతకు సమయం వెచ్చిస్తే పాఠశాలల్లో విద్య బోధన కుంటుపడుతుందన్నారు. యుటిఎఫ్ ఒకవైపు టెట్ పరీక్ష రద్దుకు పోరాటాలు చేస్తూనే మరోవైపు, ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వడం ద్వారా టెట్ ఉత్తీర్ణత పొందేందుకు కృషి చేస్తున్నదని ఆయన తెలిపారు. బోధనా పద్ధతుల్లోని విధానాలను విశ్లేషణాత్మకంగా వివరించారు. టెట్ ఉత్తీర్ణత సాధించేందుకు అవసరమైన విధానాలను సులభరీతిలో బోధించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి కె.సుధాకర్, ఐక్య ఉపాధ్యాయ జిల్లా కన్వీనర్ టి.శివ ప్రసాద్, అకడమిక్ సెల్ జిల్లా కన్వీనర్ వీరదాసరి క్రిస్టఫర్, సిపిఎస్ జిల్లా కన్వీనర్ ఎన్.పవన్ కుమార్, బద్వేలు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.దేవానందం, సి.కంచిరెడ్డి, ట్రెజరర్ ఎ.లాజరస్, గోపవరం మండల అధ్యక్షులు ఎస్.మస్తాన్ వలి, జిల్లా కౌన్సిల్ సభ్యులు పాలా శ్రీనివాసుల రెడ్డి, సి.హెచ్ సాగర్, తదితరులు పాల్గొన్నారు.

## బ్రహ్మంగారి నివాస గృహానికి చందా

**బ్రహ్మంగారిమఠం జూలై 05 ప్రభాతవార్త**

భూత భవిష్యత్ వర్తమాన కాలజ్ఞానాన్ని రచించిన జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి కందిమల్లాయపల్లెలో నివాస చేసిన గృహపున: నిర్మాణమునకు చేపడుతున్న క్రమంలో ప్రకాశం జిల్లా, వలేటివారిపాలెం మండలం, సింగమనేని పల్లె గ్రామ వాస్తవ్యులు అయిన పునాటి రమేష్ ధర్మపత్ని రమాదేవి తమ వంతు సాయంగా 2,00,016 రెండు లక్షల పదహారు రూపాయలను మఠం కార్యాలయంలో సిబ్బంది వేణు గోపాల్, సుబ్బారాయుడు, శ్రీనివాసులకు నగదు అందజేశారు. వారికి మఠాధిపతులు శ్రీ వీర ధర్మజ వెంకటాద్రి స్వామి వారి ఆజ్ఞ మేరకు ఆలయ మర్యాదలతో శేష వస్త్రాలతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఎవరైనా భక్తులు నివాస గృహ పునం: నిర్మాణం నకు భాగస్వాములు కావాలనుకున్న వారు మఠం కార్యాలయం లో సంప్రదించండి.



## డాక్టర్లు, ఆడిటర్లు సేవలు సమాజానికి ఆదర్శం

### డాక్టర్స్ డే, చార్టెడ్ అకౌంటెంట్స్ డే వేడుకలు



**ప్రొద్దుటూరు అర్బన్ , జులై 5, ప్రభాత వార్త :**

సమాజానికి వైద్యులు, చార్టెడ్ అకౌంటెంట్లు అందిస్తున్న సేవలు ఆదర్శనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. డాక్టర్స్ డే, చార్టెడ్ అకౌంటెంట్స్ డే సందర్భంగా రోటరీ క్లబ్ ప్రొద్దుటూరు ఆధ్వర్యంలో ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు రొటేరియన్ పీహెచ్ఎఫ్ కొవ్వూరు రమేష్ రెడ్డి అధ్యక్షతన, కార్యదర్శి గండ్లూరు శ్రీధర శర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రొద్దుటూరుకు చెందిన ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ వై.వి. రామముని రెడ్డి, డాక్టర్ ప్రతిమ దేశాయ్, డాక్టర్ వంకదార శివరాం లను వారి విశిష్ట వైద్య సేవలకు గాను ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎన్టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ ఈసీ సభ్యుడు డాక్టర్ టి.డి. వరుణ్ కుమార్ రెడ్డి వైద్యుల సేవలను ప్రశంసించారు. సమాజానికి వైద్యులు అందిస్తున్న సేవలు అమూల్యమని ఆయన పేర్కొన్నారు. చార్టెడ్ అకౌంటెంట్స్ డే సందర్భంగా సీనియర్ చార్టెడ్ అకౌంటెంట్ గాదంశెట్టి గోపాల్ రావును చార్టెడ్ అకౌంటెంట్ మేడ చంద్రశేఖర్ ను సన్మానించారు. ఆర్థిక రంగంలో చార్టెడ్ అకౌంటెంట్ల పాత్ర కీలకమని ఈ సందర్భంగా వక్తలు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమానికి రోటరీ ట్రస్ట్ అధ్యక్షుడు ఎం.వి.ఎన్. ప్రభు కుమార్ సహకారం అందించారు. ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు డాక్టర్ లక్ష్మీప్రసన్న, రోటరాక్ట్ కార్యదర్శి టి.వి.ఎన్. ప్రసాద్ రెడ్డి, రోటరీ సభ్యులు మురుకుటి సూర్యనారాయణ రెడ్డి, గుర్రం రామకృష్ణ, కె. మల్లికార్జున, బాల సూర్యారావు, గజ్జల వెంకటేశ్వర రెడ్డి, రోటరీ హాస్పిటల్ కార్యదర్శి జాకీర్ అహ్మద్, కోటా శివకుమార్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

### సర్ ప్రక్రియలో

## ప్రతి ఒక్కరికి న్యాయం జరగాలి

### మాజీ ఎమ్మెల్యే తిప్పారెడ్డి, నిస్సార్‌అహ్మద్‌లు



సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

**మదనపల్లె, జూలై 5 ప్రభాతవార్త :**

సర్ ప్రక్రియలో అర్హత కలిగిన ప్రతి ఓటరుకు న్యాయం జరగాలని మాజీ ఎమ్మెల్యే దేశాయ్ తిప్పారెడ్డి, వైకాపా నియోజకవర్గ ఇన్‌చార్జ్ నిస్సార్‌అహ్మద్‌లు తెలిపారు. ఆదివారం పట్టణంలోని దేశాయ్ పంక్షన్‌హాలులో సర్ ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్ పురోగతి, ఎన్యూమరేషన్‌ల ఫారాల పంపిణీ, డిజిలైటేషన్, ఓటర్ల ఫిర్యాదులు, క్షేత్రస్థాయిలో సమస్యలు, పరిష్కారం మార్గాలపై చర్చించారు. సర్ ప్రక్రియలో బిఎల్‌ఏలు అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు. వార్డుల్లో పర్యటించి ప్రతి కుటుంబాన్ని కలవాలని, ఓటర్ల సమస్యలను గుర్తించి పరిష్కరించాలన్నారు. మేథావుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి వివిఎస్.రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలోని 260పోలింగ్ కేంద్రాలు ఉండగా 60కేంద్రాల్లో 40 శాతం కంటే తక్కువ డిజిటైలేజన్ జరిగిందన్నారు. సర్ ప్రక్రియను సమర్థవంతంగా పర్యవేక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఈసి సభ్యురాలు షమీం అస్లాం, నాయకులు శ్రీనివాసులు, ప్రసాద్‌బాబు, గుండ్లూరురఫి, మస్తాన్‌రెడ్డి, సాయిశేఖర్‌రెడ్డి, శారదారెడ్డి, కరుణాకర్‌రెడ్డి, జన్నేచలపతి పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగుల డిమాండ్స్ పరిష్కరించాలి

**పీలేరు జూలై 5 ప్రభాతవార్త:**

ఏపీ జేఏసీ అన్నమయ్య జిల్లా చైర్మన్ యం.వేణుగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి, శాసన సభ సభ్యులు, పీలేరు ఉద్యోగుల దీర్ఘకాల సమస్యల పరిష్కారానికి ఉద్యోగుల పక్షం వహించాలని, కూటమి ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లకు సంబంధించిన బకాయిల చెల్లింపు, వైద్య, ఆరోగ్య శాఖ నందు తొలగించబడిన ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవడం, ప్రభుత్వరంగ సంస్థలకు, గురుకుల సొసైటీలకు పదవీ విరమణ వయస్సు 60 నుంచి 62కు పెంపు, మెమో 57 ప్రకారం 11,000 మందికి CPS నుంచి OPS అమలు వంటి అంశాలలో సానుకూల నిర్ణయాలు తీసుకోవడమైనది రాష్ట్ర జేఏసీ ఛైర్మన్ అలపర్తి విద్యాసాగర్ రాష్ట్ర సెక్రటరీ జనరల్ ప్రసాద్, రాష్ట్ర జనరల్ సెక్రెటరీ డి. వి రమణ ఆదేశాల మేరకు ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యలు పీఆర్సీ కమిటీని తక్షణమే నియమించి, మధ్యంతర భృతి ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలు సరెండర్ లీవ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వానికి సిఫారసు చేయాలని, జులై 26వ తేది లోపు ఉద్యోగుల డిమాండ్స్ పట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని కోరుతూ వినతి పత్రం సమర్పించడమైనది. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు శ్రీనివాసన్, రెడ్డెప్ప నాయుడు, సి బాబు రెడ్డి, వెంకట రమణ రెడ్డి,ఈశ్వర్ ప్రసాద్, నాగేశ్వర్, వెంకట రమణ, మురళి, మనోహర్, శివప్రసాద్, రమేష్ బాబు, బాలకృష్ణ,రెడ్డి వరప్రసాద్, మంజునాథ్, వెంకట రమణ మరియు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేలను సన్మానిస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు

## పంటలకు గిట్టుబాటు ధర చట్టం చేయాలి



**మైదుకూరు, జూలై 05, ప్రభాతవార్త:**

రైతు పండించిన పంటలను గిట్టుబాటు ధర చెల్లించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే కొనుగోలు చేసే విధంగా "గిట్టుబాటు ధర చట్టం" తీసుకురావాలని రైతు సేవా సమితి కడప జిల్లా అధ్యక్షుడు ఏవి.రమణ,నియోజకవర్గ కార్యదర్శి మాడిశెట్టి సహదేవుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. రైతు సేవా సమితి కడప జిల్లా అధ్యక్షుడు ఏవి రమణ మండలం లోని ఓనిపెంట గ్రామ ఉల్లిపొలంలో రైతు కూలీలతో కలిసి మాట్లాడుతూ, "కష్టజీవి, శ్రమజీవి అయిన రైతు మూడు నెలలు, ఆరు నెలలు, సంవత్సరం పాటు ఎండ, వాన, కరువు కాటకాలను తట్టుకుని, రాత్రి పగలు శ్రమించి పంట పండిస్తున్నాడు. కానీ విత్తనం దగ్గర నుంచి ఎరువులు, పురుగు మందులు, కూలీల వరకు వ్యాపారులు, కూలీలు చెప్పిన ధరకే రైతు చెల్లిస్తున్నాడు. చివరకు పంట అమ్ముకునే సమయంలో మాత్రం వ్యాపారులు నిర్ణయించిన ధరకే, గిట్టుబాటు కాకపోయినా అమ్ముకుని రైతు నష్టపోతున్నాడు" అని ఆవేదన వ్యక్తం చేశారు. "రైతు పంట విత్తనం మొదలుపెట్టే సమయంలోనే ఈ సంవత్సరం ఈ పంటకు ఈ ధర అని ప్రభుత్వం ముందే నిర్ణయించాలి. అప్పుడే రైతుకు ఆదాయం ఉంటే పంట పండిస్తాడు, లేకపోతే మానేస్తాడు. అంతేగాని రైతు పండించిన తర్వాత వ్యాపారులు నిర్ణయించిన రేటుకు అమ్మితే పెట్టుబడులు కూడా రాక రైతు నష్టపోతున్నాడు. కాబట్టి రైతులు పండించిన పంటలను ప్రభుత్వాలే కొనుగోలు చేసి వ్యాపారులకు అమ్మే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిట్టుబాటు ధర చట్టం చేయాలి" అని రైతు సేవా సమితి నేతలు కోరారు.

## భూపేష్ వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలి

**ఆదినారాయణరెడ్డి కుటుంబాన్ని ఆదుకున్నదే వైయస్సారే**

**జేఎస్‌డబ్ల్యూ స్టీల్ ప్లాంట్‌కు అనుమతులు ఇచ్చింది జగన్ ప్రభుత్వమే**

**రాయలసీమకు తీవ్ర అన్యాయం చేసిన చంద్రబాబు**

**ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తే అక్రమ కేసులు నమోదు**

**వైకాపా నాయకులు**



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న వైకాపా నాయకులు

**పులివెందుల, జూలై 5, ప్రభాతవార్త :**

టీడీపీ నేత భూపేష్ చేసిన వ్యాఖ్యలు వాస్తవాలకు దూరంగా ఉన్నాయని, చరిత్ర తెలుసుకుని మాట్లాడితే మంచిదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మున్సిపల్ మాజీ చైర్మన్ వరప్రసాద్, మాజీ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ గోటూరు చిన్నప్ప, సివిల్ సప్లై మాజీ డైరెక్టర్ హల్ గంగాధర్ రెడ్డి, ఒతూరు రసూల్ తదితర నాయకులు విమర్శించారు. ఆదివారం స్థానిక జగన్ క్యాంప్ కార్యాలయం నందు ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ ఆదినారాయణరెడ్డి కుటుంబం రాజకీయంగా నిలదొక్కుకోవడానికి దివంగత మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖరరెడ్డి కుటుంబం చేసిన సహకారం మరువరానిదన్నారు. దేవగుడి నారాయణరెడ్డి పులివెందుల నుంచి జమ్మలమడుగుకు వెళ్లే సమయంలో వైఎస్సార్ అభి మానులు రక్షణగా వెంట వెళ్లేవారని, అలాంటి కుటుం బం ఈరోజు వైఎస్సార్ కుటుంబంపై విమర్శలు చేయడం కృతఘ్నతకు నిదర్శనమని ఆరోపించారు. దేవగుడిలో వైఎస్సార్ విగ్రహాన్ని ధ్వంసం చేయడం పిరికిపంద చర్య అని, ఇలాంటి చర్యలను ప్రజలు ఎప్పటికీ క్షమించరన్నారు. ఆదినారాయణరెడ్డి పదవుల కోసం రాష్ట్రంలోని వివిధ రాజకీయ పార్టీలను మారారని, ఆయన రాజకీయ గతం జిల్లా ప్రజలకు తెలుసని వ్యాఖ్యానించారు. జేఎస్‌డబ్ల్యూ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు అవసరమైన అనుమతులు గత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలోనే మంజూరయ్యాయని, అందు వల్లే ప్రాజెక్టు కార్యరూపం దాల్చిందని తెలిపారు. దీనికి సంబంధించి జేఎస్‌డబ్ల్యూ అధినేత సజ్జన్ జిందాల్ కూడా సామాజిక మాధ్యమాల్లో చేసిన వ్యాఖ్యలు ఇందు కు నిదర్శనమని పేర్కొన్నా రు.చంద్రబాబు నాయుడు హయాంలో గండికోట ప్రాజెక్టు సామర్థ్యాన్ని తగ్గించడం, పులివెందుల మెడికల్ కళాశాల అనుమతులు రద్దు చేయడం, కడప నుంచి పలు బ్యాంకుల ప్రధాన కార్యాల యాలను తరలించడం వంటి చర్యల ద్వారా రాయలసీమకు అన్యాయం జరిగిందని ఆరోపించారు.అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను నిరాశపరిచిందని, ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు నమోదు చేసి వేధింపులకు పాల్పడడం అప్రజాస్వామికమని విమర్శిం చారు.ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, వైఎస్ అవినాష్ రెడ్డి ప్రత్యేక చొరవతో పులివెందుల నియోజకవర్గంలో సుమారు రూ.3 కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేపట్టినట్లు వైసీపీ నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో పట్టణ ఉపాధ్యక్షుడు పార్నపల్లి కిషోర్, కోడి రమణ,కో అప్షన్ మెంబెర్ చంద్రమోళి,వైకాపా నాయకులు చంద్రమోళి, నాగేంద్ర,భాస్కర్ రెడ్డి,దశరథ రామిరెడ్డిలు అన్నారు.

## మహిళల బద్రతే పోలిసుల కర్తవ్యం



**వేంపల్లె జూలై 05 ప్రభాతవార్త**

మహిళలు, చిన్నారుల బద్రతే పోలిసుల కర్తవ్యమని వేంపల్లె సీఐ టి.నరసింహులు వెల్లడించారు. ఆదివారం స్థానిక పులివెందుల రోడ్డులోని ఎంపెహెచ్ ఫంక్షన్ హాల్ లో వివిధ చట్టాలపై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల బద్రత, రక్షణకు పోలిసులు నిరంతరం అప్రమత్తంగా పని చేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న శక్తి యాప్ వినియోగంపై వివరించారు. ఆపద సమయంలో పోలీస్ రక్షణకు డయల్ 112, సైబర్ నేరాల పట్ల అప్రమత్తత, బాల్య వివాహాలు అరికట్టడం, మాదక ద్రవ్యాల నిరోధకం, గృహ హింస తదితర చట్టాలపై మహిళలకు అవగాహన కల్పించారు. మహిళలు, చిన్నారుల బద్రతే లక్ష్యంగా పోలిసు యంత్రాంగం పని చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు తయ్యార్ హుస్సేన్, తిరుపాల్ నాయక్, ఏపిఎం వెంకటేశ్వర రావు, బిజెపి రాష్ట్ర మహిళా మోర్చ ప్రధాన కార్యదర్శి సుష్మా, డ్వాక్రా సంఘాల మహిళలు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

## నేత్రదానం చేసి ఇద్దరు అంధుల జీవితాల్లో వెలుగు నింపిన రామలక్షుమ్మ



**పులివెందుల,జూలై 5, ప్రభాత వార్త :**

నియోజకవర్గం లోని తొండూరు మండలం సైదాపురం గ్రామానికి చెందిన కోటిరెడ్డి రామలక్షుమ్మ (85) ఆదివారం వయోభారంతో కన్నుమూశారు. ఆమె మరణానంతరం కుటుంబ సభ్యులు మానవతా దృక్పథంతో నేత్రదానానికి అంగీకరించడంతో ఇద్దరు అంధులకు చూపు ప్రసాదించే అవకాశం లభించింది. సమాచారం అందుకున్న అనంతపురం ఇండియన్ రెడ్ క్రాస్ నేత్ర సేకరణ కేంద్రం టెక్నీషియన్ రాఘవేంద్ర, స్నేహిత అమృత హస్తం సేవాసమితి ప్రతినిధులతో కలిసి మృతురాలి రెండు కార్నియాలను విజయ వంతంగా సేకరించారు. అనంతరం వాటిని హైదరాబాద్‌లోని డాక్టర్ అగర్వాల్ నేత్రనిధికి తరలించారు. వైద్యుల పర్యవేక్షణలో ఈ కార్నియాలను ఇద్దరు అంధులకు అమర్చనున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు మాట్లాడుతూ, నేత్రదానం మహాదానమని, మరణానం తరం కూడా మరో ఇద్దరి జీవితాల్లో వెలుగు నింపే అవకాశం కల్పిస్తుందన్నారు. శోకసమయం లోనూ సమాజ హితం కోసం నేత్రదానానికి ముందుకొచ్చిన రామలక్షుమ్మ కుటుంబ సభ్యుల సేవాభావాన్ని గ్రామస్థులు, బంధువులు, సేవాసమితి ప్రతినిధులు అభినందించారు.

## 53 శాతం ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ పూర్తి

### సిద్దవటం తహసీల్దార్ విజయ్ కుమార్



**సిద్దవటం జులై 5 ప్రభాతవార్త**

మండలంలో ఇప్పటి వరకు బిఎల్ఓ లు 53 శాతం ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ పూర్తి చేశారని తహసీల్దార్ విజయ్ కుమార్ తెలిపారు. సిద్దవటంలోని స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం తహసీల్దార్ ఎస్ఐఆర్ పై బిఎల్ఓ ల పని తీరుపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేస్తున్నామన్నారు. మండలంలో 31662 మంది ఓటర్లు ఉండగా ఇప్పటి వరకు 16783 ఓటర్లకు సంబంధించిన ఇన్యుమరేషన్ ఫాంల వివరాలు ఎస్ఐఆర్ లో డిజిటలైజేషన్ చేయడం జరిగిందన్నారు. 40 మంది బిఎల్ఓ లు, నలుగురు సూపర్వైజర్లు ఇంటింటికి వెళ్లి ఇన్యుమరేషన్ ఫాం లను అందజేయడం జరిగిందన్నారు. జూన్ 15వ తేదీ నుంచి మొదలైన ఎస్ఐఆర్ ప్రక్రియ జులై 14వ తేదీ వరకు నెల రోజుల పాటు ఉంటుందన్నారు. మిగిలిన 43 శాతం ఇన్యుమరేషన్ ఫాం లను బిఎల్ఓలు డిజిటలైజేషన్ ను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. 24 సంవత్సరాల తర్వాత వచ్చిన సర్ 2002 ఓటర్ జాబితాను 2026 ఓటర్ జాబితాతో మ్యాపింగ్ చేయాలన్నారు. 18 సంవత్సరాలు వయస్సు ఉన్న వారి ఓట్లను చేర్చడం జరుగుతుందని, చనిపోయిన, వలసదారుల, భోగస్ ఓట్లను తొలగించడం జరుగుతుందని ప్రజలు బిఎల్ఓ లకు సహకరించాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో రెవిన్యూ ఇన్స్పెక్టర్ ప్రసాద్, బిఎల్ఓలు పాల్గొన్నారు.

## పార్టీ పదవి కోసం రిటైర్డ్ కల్నల్ దరఖాస్తు

**మైదుకూరు,జూలై 05, ప్రభాతవార్త:**

జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పార్టీ పదవుల దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం ఆదివారం విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా కడపలోని హరిత హోటల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకుడు, మైదుకూరు రిటైర్డ్ కల్నల్ కందునూరు గోపి పార్టీ పదవి కోసం తన దరఖాస్తును సమర్పించారు. జనసేన పార్టీ నిర్మాణ సారథుల సమాచార సేకరణ కమిటీ పార్లమెంట్ పర్యవేక్షకులు చిలకం మధుసూదన్ రెడ్డికి ఆయన దరఖాస్తును అందజేశారు.కందునూరు గోపి మాట్లాడుతూ "జనసేన పార్టీ సిద్ధాంతాలు, ఆశయాలకు అనుగుణంగా ప్రజాసేవలో మరింత చురుకైన పాత్ర పోషించాలనే సంకల్పంతో ఈ దరఖాస్తు సమర్పించాను. పార్టీ బలోపేతానికి, గ్రామస్థాయి నుంచి ప్రజల సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేస్తాను. పార్టీ నాయకత్వం నాపై ఉంచే ఏ బాధ్యతనైనా సమర్థవంతంగా నిర్వర్తిస్తూ, జనసేన ఆశయాల సాధనకు నిబద్ధతతో కృషి చేస్తాను" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు జీసి.కృష్ణమూర్తి, గోసిటి రామ గోవిందు, దాసరి రవిశంకర్, భరత్, దండు శ్రావణ్, కర్రె పుల్లయ్య, విశ్వేశ్వరయ్య, దస్తగిరి, శీను పాల్గొన్నారు.





## ఆల్‌ఆఫ్‌యు దివ్యాంగుల ఆధ్వర్యంలో సమావేశం

**ప్రొద్దుటూరు క్రైం, జులై 5, ప్రభాతవార్త:**



ఆల్ ఆఫ్ యు దివ్యాంగుల సేవా సొసైటీ రాష్ట్ర కన్వీనర్ దొడియం అప్జల్, గౌరవాధ్యక్షులు చలపతిరావుల ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం మున్సిపల్ పార్కు వద్ద దివ్యాంగుల స్లాట్ బుకింగ్‌పై సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దివ్యాంగులు ఎంతో కాలం నుంచి వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్నవారికి కొత్త సదరం సర్టిఫికెట్ల కొరకు స్లాట్ బుక్ చేసుకునేందుకు ఒక రోజు ముందుగానే సచివాలయం వెళ్లి సదరం సెల్ఫ్ డిక్లరేషన్ దరఖాస్తు తీసుకొని పూర్తి చేసి జులై 8వ తేదీ బుధవారం ఉదయం 10 గంటలకు మీ సమీపంలోని గ్రామ, వార్డు సచివాలయంలో కానీ, మీ సేవ కేంద్రాల్లో కానీ ఆన్‌లైన్ ఓపెన్ అవుతుందన్నారు. సర్టిఫికెట్లు లేని అర్హులైన దివ్యాంగులు ఈ అవకాశాన్ని తప్పక వినియోగించుకోవాలని జులై, ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో ఆసుపత్రుల్లో వైకల్య నిర్ధారణ పరీక్షలు చేయించుకోవడానికి దివ్యాంగ అభ్యర్థులు తమ ఆధార్, రేషన్, అడ్రస్ నిర్ధారణ పత్రం, పాస్‌పోర్టు సైజు ఫొటోతో మీ సమీపంలోని సచవాలయంలో సదరం స్లాట్ బుకింగ్ చేసుకోవాలన్నారు. మళ్లీ 3 నెలల వరకు ఈ అవకాశం లభించదని త్వరపడాలన్నారు. ఉదయాన్నే ఒక గంటలోనే అన్ని స్లాట్స్ పూర్తయ్యే అవకాశం ఉంది. ఉదయం 10 గంటలకే సచివాలయల్లో నమోదు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల ప్రధాన కార్యదర్శి అబ్దుల్ రషీద్, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

**దువ్వూరు, జూలై 05 ప్రభాతవార్త:**

వాహణదారులు వాహనాలను నడిపే సమయంలో ట్రాఫిక్ నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని ఎస్ఐ ధనుంజయుడు అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన దువ్వూరులోనూ, జాతీయ రహదారి అయిన ఆంజనేయ స్వామి దేవాలయం వద్ద అలాగే కామనూరు రోడ్లను వివిధ పాయింట్లలో వివిధ రకాల వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సక్రమంగా రికార్డులు లేని వారికి, హెల్మెట్లు ధరించని వారికి జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా ఆయన వాహనదారులతో మాట్లాడుతూ వాహనాలు నడిపే వారు ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని అలాగే వాహనానికి సంబంధించిన రికార్డులు ఉంచుకోవాలన్నారు. రోడ్డు క్రాసింగ్ చేసే సమయంలోను వెనుక ముందు చూసుకొని వాహనాలను నడపాలని సూచించారు. ఇటీవల రోడ్డు ప్రమాదాలు జరగకుండా వాహన తనిఖీ చేపడుతున్నట్లు తెలిపారు.



## ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ సస్పెన్షన్

**ముద్దనూరు, జూలై 5 (ప్రభాతవార్త):**

ముద్దనూరు ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని ఎన్ కె కాలువ పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ కె. సుబ్బరాయుడిని సస్పెండ్ చేసినట్లు జిల్లా అటవీ అధికారి (డీఎఫ్ఓ) రాజశేఖర్ బాబు తెలిపారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించినట్లు వచ్చిన ఆరోపణలపై విచారణ చేపట్టగా, అవి నిజమని నిర్ధారణ కావడంతో ఆయనపై సస్పెన్షన్ చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా డీఎఫ్ఓ మాట్లాడుతూ, అటవీ శాఖకు సంబంధించిన ప్రభుత్వ ఆస్తులపై ఎలాంటి పనులు చేపట్టాలన్నా సంబంధిత అధికారుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. నిబంధనలను ఉల్లంఘించి ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

### పాత పెన్షన్ సాధనకు కృషి చేసిన

## ఒంటేరు శ్రీనివాసుల రెడ్డికి పోలీసు ఉద్యోగుల ఆత్మీయ సన్మానం

**ప్రొద్దుటూరు అర్బన్, జులై 5, ప్రభాతవార్త**

2004 సెప్టెంబర్ 1వ తేదీకి ముందు (2003 పోలీస్ నియామక నోటిఫికేషన్) విడుదలైన నోటిఫికేషన్ ద్వారా నియమితులైన పోలీసు శాఖ ఉద్యోగులకు పాత పెన్షన్ (ఓపీఎస్) అమలుకు కృషి చేసిన ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఒంటేరు శ్రీనివాసుల రెడ్డితో పోలీసు ఉద్యోగులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. స్థానిక శ్రీరాములపేటలోని ఉపాధ్యాయ సేవా కేంద్రంలో ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో ఒంటేరు శ్రీనివాసుల రెడ్డి మాట్లాడుతూ, రెండు దశాబ్దాలకు పైగా పాత పెన్షన్ సాధన కోసం నిరంతరంగా పోరాడిన ఉద్యోగ సంఘాల నాయకులు, పోలీసు సిబ్బంది, ఉద్యోగులను అభినందించారు. 2004కు ముందు పోలీసు నోటిఫికేషన్ ద్వారా ఎంపికై సేవలో చేరిన ఉద్యోగులకు పాత పెన్షన్ వర్తింపజేయడంలో రాష్ట్ర ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్, ప్రభుత్వ విప్ ఆది నారాయణ రెడ్డి ఉద్యోగుల విజ్ఞప్తిని సానుకూలంగా పరిశీలించి, పాత పెన్షన్ అమలుకు నిర్ణయం తీసుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎన్‌టీఆర్ వైద్య విశ్వవిద్యాలయం పాలక మండలి సభ్యులు డాక్టర్ టిడి వరుణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, 2004కు ముందు ఉద్యోగాలు సాధించిన వారికి పాత పెన్షన్ అమలు దిశగా విశేష కృషి చేసిన ఒంటేరు శ్రీనివాసుల రెడ్డిని అభినందించారు. అలాగే దీర్ఘకాలంగా పోరాటం చేసిన పోలీసు ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులను కూడా అభినందించారు. ఈ ఆత్మీయ సమ్మేళనంలో 50 మందికి పైగా పోలీసు మిత్రులు, వివిధ శాఖల ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

